ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
ఆదివారం 29 జూన్ 2025



తల్లులకు నిరీక్షణ



- ఎంసీహెచ్ కిట్లు లేవు.. పైసలు రావు..
- అమ్మఒడి పథకం.. మదర్ చైల్డ్ హెల్త్‌గా మార్పు
- గర్భిణులు, బాలింతలకు తప్పని ఎదురుచూపులు
- నాలుగేళ్లుగా అందని ప్రోత్సాహకం
- జిల్లాలో 60558 మంది లబ్ధిదారులు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

తల్లులకు నిరీక్షణ తప్పడం లేదు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలను పెంచే దిశగా గత ప్రభుత్వ హయాంలో ప్రతిష్టాత్మకంగా సాగిన అమ్మఒడి పథకం లక్ష్యం కొంతమేరకు నేరవేరినా గర్భిణులు, బాలింతలకు అందించే ప్రోత్సాహకానికి ఎదురుచూడక తప్పడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత అమ్మఒడి పథకం పేరును మదర్ చైల్డ్ హెల్త్‌గా మార్చినా పైసలు మాత్రం అందడం లేదు. మాతా శిశు మరణాలు తగ్గించడం, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు పెంచేందుకు దోహదపడుతున్న నగదు ప్రోత్సాహకానికి కొద్ది రోజులుగా నిరీక్షణ తప్పడం లేదు. నాలుగు విడతలుగా అందించే ప్రోత్సాహకం దాదాపు మూడేళ్లుగా ఎదురు చూపులకే పరిమితం అయ్యింది. కొద్ది రోజులగా 16 వస్తువులతో కూడిన కిట్లు కూడా నిలిచిపోయాయి. 2017లో ప్రారంభమైన అమ్మఒడి పథకాన్ని మదర్ చైల్డ్ హెల్త్‌గా కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తున్నా ప్రోత్సాహక బకాయిలు అందకపోవడంతో నిరాశ చెందుతున్నారు.

జిల్లాలో రూ 18.03 కోట్ల బకాయిలు..

రాజన్న సిరిసిల్ల జిల్లాలో మదర్ చైల్డ్ హెల్త్ పథకానికి సంబంధించిన ప్రోత్సాహక బకాయిలు రూ 18.03 కోట్ల వరకు ఉన్నాయి. బకాయిల కోసం జిల్లాలో 1,28,094 అర్హులు ఉండగా, 67,536 మంది లబ్ధిపొందారు. ఇంకా 60,558 మంది గర్భిణులు, బాలింతలు ఎదురుచూస్తున్నారు. మదర్ చైల్డ్ హెల్త్ స్కీంలో గర్భం దాల్చిన తరువాత మొదటి విడతలో ప్రసవాల సమయంలో రూ.3 వేలు అందిస్తారు.

రెండో విడతలో మగబిడ్డ పుడితే రూ 4 వేలు, ఆడ బిడ్డ పుడితే రూ 5 వేలు, మిగతా 8వ పేజీలో



జిల్లా ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రి

కిసాన్ క్రెడిట్ కార్డులు, రుణాలు ఇప్పించేందుకు కృషి

సిరిసిల్ల కలెక్టరేట్, జూన్ 28(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని మత్స్యకారులందరికి కిసాన్ క్రెడిట్ కార్డులతోపాటు రుణాలను మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఇప్పించేందుకు కృషి చేస్తానని జిల్లా మత్స్య పారిశ్రామిక సంఘం జిల్లా అధ్యక్షుడు చొప్పరి రామచంద్రం అన్నారు. కలెక్టరేట్‌లోని మత్స్యశాఖ కార్యాలయంలో శనివారం జిల్లా మత్స్యపారిశ్రామిక సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మత్స్య పారిశ్రామిక సంఘం పేరుతో జిల్లా కేంద్రంలో కమ్యూనిటీ భవనం నిర్మాణంతో పాటు కిసాన్ క్రెడిట్‌కార్డు, రుణాలు, ప్రధాన మంత్రి మత్స్యకిసాన్ సమృద్ధి సహయోజన పథకాలను అందించాలని తీర్మానాలు చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో అధ్యక్షుడు రామచంద్రం మాట్లాడుతూ జిల్లాలో మత్స్యకారులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలను వర్తింపజేయడంతో పాటు అన్నింటిని మత్స్యశాఖ ద్వారా అందించేందుకు కృషి చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా మత్స్యశాఖ అధికారి సౌజన్య, ఉపాధ్యక్షుడు అంబటి శేఖర్, డైరెక్టర్లు కూనవేణి పర్శరాములు, పని శివరామకృష్ణ, యామా తిరుపతి, నల్లమోహన్, పిట్టల బాబు తదితరులు పాల్గొన్నారు.

సరికొత్త ఆవిష్కరణలతో సత్తా చాటాలి

- ఇన్‌చార్జి జిల్లా విద్యాధికారి వినోద్‌కుమార్



విద్యార్థులను అభినందిస్తున్న ఇన్‌చార్జి డీఈవో వినోద్‌కుమార్

గంబీరావుపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు సరికొత్త ఆవిష్కరణలతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటాలని ఇన్‌చార్జి డీఈవో వినోద్ కుమార్ అన్నారు. గంబీరావుపేట మండలం దమ్మన్నపేట గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. పదో తరగతి విద్యార్థుల ప్రగతిని ఆరా తీశారు. విద్యార్థులు తయారు చేసిన పరికరాన్ని పరిశీలించి పని తీరును అడిగి తెలుసుకున్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలన్నారు. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు వెళుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయుడు సంపత్‌కుమార్‌ను అభినందించారు. వెంట ఎంఈవో గంగారం, హెచ్ఎం వెంకటేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలకు జిల్లా విద్యార్థులు..



పోటీల్లో పాల్గొనేందుకు వెళుతున్న విద్యార్థులు

సిరిసిల్ల టౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలకు శనివారం జిల్లా కేంద్రం నుంచి విద్యార్థులు తరలివెళ్లారు. రెండు రోజుల పాటు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కృష్ణారెడ్డి ఫంక్షన్ హాల్‌లో రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ పోటీలు జరగనున్నాయి. జిల్లా నుంచి కిక్ బాక్సింగ్ మాస్టర్ వొడ్నాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో 20మంది విద్యార్థులు పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులతో కోచ్‌లు వొడ్నాల శ్రీనివాస్, ఎలగుందుల శ్రీనివాస్ మహబూబ్‌నగర్‌కు వెళ్లారు.

స్పోర్ట్స్ స్కూల్స్‌కు విద్యార్థుల ఎంపిక

సిరిసిల్ల టౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా యువజన క్రీడాశాఖ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్స్‌లో ప్రవేశాలలో అర్హత ఉన్న విద్యార్థులను ఎంపిక చేశామని శనివారం జిల్లా యువజన క్రీడలశాఖ అధికారి అజ్మీరా రాందాస్ తెలిపారు. 2025-26విద్యా సంవత్సరానికి తెలంగాణలోని హకీంపేట, కరీంనగర్, అదిలాబాద్ జిల్లాలోని స్పోర్ట్స్ స్కూల్స్‌లో 4వ తరగతిలో ప్రవేశాల కోసం ఈనెల 26న రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో జిల్లాలలోని విద్యార్థులకు పోటీలను నిర్వహించడం జరిగదని తెలిపారు. జిల్లా స్థాయి ఎంపికలలో బాలుర విభాగంలో 10, బాలికల విభాగంలో 10మంది విద్యార్థులను ఎంపిక చేయబడిందని పేర్కొన్నారు. మామిండ్ల విశ్వవేద్(వేములవాడ), కోలా శాన్వి(ఇల్లంతకుంట), ఎం తనూష్(వేములవాడ), నిహాన్విత(గర్జనపల్లి), ఎం గోవర్ధన్(బోయినపల్లి), శ్రుతిక(చందుర్తి), శ్రీహర్ష(కోనరావుపేట), ఐలేని వినూత్న(నేరెళ్ళ), హర్ష(రుద్రంగి) టీ ఘనశ్రీ(నేరెళ్ళ) బీ హర్ష(రుద్రంగి), ఘనశ్రీ (కోనరావుపేట), కే వేదాక్షర్(తంగళ్ళపల్లి), ఆర్ అక్షిత(వీర్నపల్లి) కే చాణక్యమన్విత్ (తంగళ్ళపల్లి), సుల్తాన్‌సాన్వి(వేములవాడ), పీ హరికృష్ణ (బోయినపల్లి), జక్కుల హృతికశ్రీ(కోనరావుపేట), బీ సిల్వరాజ్(వీర్నపల్లి), వీ మధుశరణ్య(కోనరావుపేట) ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఎంపికైన బాలబాలికలు ఆధార్‌కార్డు, పుట్టిన తేది ధ్రువీకరణ, విద్యార్హత ధ్రువీకరణ, 3వ తరగతి ప్రోగ్రెస్ రిపోర్టు, కుల ధ్రువీకరణ పర్జినల్, జిరాక్స్ కాపీలతో పాటు ఐదు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో జూలై 1న హైదరాబాద్ హకీంపేట స్పోర్ట్స్ స్కూల్స్‌లో రాష్ట్ర స్థాయి ఎంపికల పోటీలలో పాల్గొన్నాలని సూచించారు.

గిరిజనుల వికాసానికి అవగాహన సదస్సులు

సిరిసిల్ల కలెక్టరేట్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : గిరిజనుల వికాసానికి సామాజిక ఆర్థిక అభ్యున్నతి కోసం జూలై 1 నుంచి 5వ తేదీ వరకు ఎంపిక చేసిన గ్రామాల్లో వివిధ శాఖల అధికారులు అవగాహన సదస్సులను ఏర్పాటు చేస్తారని, వీటిని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి సంగీత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రధానమంత్రి ధర్తి అబాజన జాతీయ గ్రామ ఉత్కర్ష, జన భగీదరి అభియాన్ పథకం కింద రాజన్న సిరిసిల్ల జిల్లాలోని రుద్రంగి మండలం మానాల, వీర్నపల్లి మండలంలోని గర్జనపల్లి, మద్దిమల్ల గ్రామాలను ఎంపిక చేశామని తెలిపారు. ఈ గ్రామాల పరిధిలోని గిరిజనులకు సామాజిక ఆర్థిక అభ్యున్నతి కోసం ఏర్పాటు చేసే అవగాహన సదస్సుల్లో గిరిజనులు తమ ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, ఆయూష్మాన్ భారత్ కార్డు, కిసాన్ క్రెడిట్ కార్డు, పీఎం కిసాన్, జనధన్ అకౌంట్, జాబ్‌కార్డు, కులం సర్టిఫికేట్, ఇన్సూరెన్స్‌లపై దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. వీర్నపల్లి మండలంలోని మద్దిమల్ల తండా, సీతారామ నాయక్‌తండా, నాయక్‌తండా, జవహర్ లాల్ తండా, రుద్రంగి మండలంలోని మానాల పరిధిలోని వీరుని తండా, అడ్డబోర్ తండా, దేగావాత్‌తండా, గాయిడిగుట్ల తండా, రూప్లా నాయక్ తండా, సర్పంచ్‌తండా, మానాలబడి తండా, చింతామణి తండాలల్లోని గిరిజనులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సంగీత కోరారు.

బాలకార్మిక వ్యవస్థను రూపుమాపుదాం

- చిన్నపిల్లలతో వెట్టిచాకిరి చేయిస్తే క్రిమినల్ కేసులు - నెలరోజుల పాటు ఆపరేషన్ ముస్కాన్ - ఎస్పీ మహేశ్ బి. గీతే



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్ బి. గీతే

సిరిసిల్ల క్రైం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): బాలకార్మిక వ్యవస్థను రూపుమాపుదామని ఎస్పీ మహేశ్ బి. గీతే అన్నారు. ఆపరేషన్ ముస్కాన్-11 కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో వివిధశాఖల అధికారులతో ఎస్పీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నపిల్లలతో వెట్టిచాకిరి చేయిస్తే క్రిమినల్ కేసులు తప్పవన్నారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు జూలై 1నుంచి 31వరకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్-11 కార్యక్రమాన్ని అన్ని శాఖల అధికారుల సమన్వయంతో విజయవంతం చేయాలన్నారు. ఆపరేషన్ స్మైల్-11లో పాలుపంచుకున్న ప్రతి ఒక్క అధికారి సమన్వయంతో పక్కా ప్రణాళిక రూపొందించుకొని బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించేలా విధులు నిర్వహించాలన్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో బాల్యం అమూల్యమైనందన్నారు. బాల్యాన్ని అనుభవించడం ప్రతి పౌరుని హక్కు అని, క్షణికావేషంలో పిల్లల తొందరపాటుతో చిన్నచిన్న విషయాలకే తల్లిదండ్రులను విడిచి ఇంటికి దూరంగా ఉంటున్నారన్నారు. ఇట్టి అవకాశాన్ని ఆసరాగా తీసుకొని కొందరు వారిచే పనులు చేయిస్తూ వారి జీవితాలతో ఆడుకుంటున్నారన్నారు. బాలకార్మికులు కనిపిస్తే వెంటనే సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలన్నారు. బాలకార్మికులు కనిపిస్తే 1098కు వెంటనే సమాచారం అందించేలా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. బాలకార్మికులను పనిలో పెట్టుకున్న వారికి చట్ట ప్రకారం శిక్షలు పడే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సిరిసిల్ల, వేములవాడ సబ్ డివిజనల్‌లో ఒక్కో బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో పిల్లలతో పనిచేసే అవకాశాలు ఉన్న పలు పరిశ్రమలు, హోటల్స్ వ్యాపార సముదాయాలు, మేకానిక్ షాపులు, ఇటుక బట్టీల వద్ద తనిఖీలు నిర్వహించాలన్నారు. పాఠశాలలకు వెళ్లకుండా వివిధ కారణాల వల్ల డ్రాపౌట్ అయిన పిల్లల తల్లిదండ్రులకు నచ్చజెప్పి తిరిగి పాఠశాలలకు పంపే విధంగా ఏర్పాటుచేసి వారికి కొత్త జీవితాలను ఇవ్వాలన్నారు. కుటుంబాలకు దూరంగా ఉంటున్న పిల్లలను గుర్తించి తల్లిదండ్రుల వద్దకు చేర్చేలా ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. గత ఏడాది జూలైలో పిల్లలతో పనిచేయిస్తున్న వారిపై 21మందిపై, ఈ ఏడాది జనవరిలో 8మందిపై క్రిమినల్ కేసులు నమోదుచేశామన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, డీఆర్‌డీవో శేషాద్రి, సిఐలు నటేశ్, నాగేశ్వర్‌రావు, అసిస్టెంట్ లేబర్ అధికారి నజీర్‌అహ్మద్, మెడికల్ అండ్ హెల్త్ అధికారి డాక్టర్ నయుమ్ జహా, విద్యశాఖ అధికారి సతీష్ కుమార్, షీటీం ఏఎస్ఐ ప్రమీలలు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు నగదు పురస్కారం అందజేత



ఉత్తమ విద్యార్థికి నగదు బహుమతిని అందిస్తున్న నిర్వాహకులు

ఇల్లంతకుంట, జూన్ 28(ఆంధ్రజ్యోతి) : మండలంలోని దాచారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థులకు శ్రీవాసంతి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వెంకట రామారావు ఎడ్యుకేషన్ స్కాలర్‌షిప్ అందించారు. పాఠశాల ఆవరణలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు తూముకుంట నరేందర్‌రెడ్డి అధ్యక్షతన శనివారం సమావేశం జరిగింది. 2024-25లో పదో తరగతిలో ప్రథమ స్థానంలో నిలిచిన గొడుగు భావనకు రూ 50వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన మారవేణి శరణ్యకు రూ30వేలు, తృతీయస్థానంలో నిలిచిన వాడె వర్షితకు రూ20వేలు అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతు విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దాతలు భరత్‌రావు, శరత్‌రావు, మండల విద్యాధికారి శ్రీనివాస్‌గౌడ్, స్కూల్‌కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు తిరుపతి, పీఎస్ హెచ్ఎం బాలగౌడ్, నాయకులు వాడె సంజీవరెడ్డి, చంద్రశేఖర్‌లతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



రుద్రంగిలో చెక్కులు పంపిణీ చేస్తున్న ఆది శ్రీనివాస్

రుద్రంగి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణంలో శనివారం కల్యాణలక్ష్మి చెక్కులు, సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విద్యుత్, ఎరువులు ప్రభుత్వ తరపున అందిస్తున్నామన్నారు. రైతులకు ఏకకాలంలో రూ. 21 కోట్ల రుణమాఫీ చేశామన్నారు. అలాగే రుద్రంగిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, ఏంపీడీవో నాటరాజ్, మాజీ జడ్పీటీసీ గట్ల మీనయ్య, మాజీ సర్పంచ్ తర్రె ప్రభలత మనోహర్, ఎర్రం గంగనర్సయ్య, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, గండి నారాయణ, మాడిశెట్టి అభిలాష్, కెసిరెడ్డి నర్సరెడ్డి, తర్రె లింగం, బైరి గంగమల్లయ్య, స్వర్గం పరందామ్, పల్లి గంగాధర్, ఎర్రం రాజలింగం, సూర యాదయ్య, గండి ఆశోక్, పూదరి మహిపాల్, చెలుకల శ్రీకాంత్, వంగ మనోజ్, నారావేణి నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.



మోత్రాయిపల్లెలో పోచమ్మ బోనాలు తీస్తున్న మహిళలు

ఘనంగా పోచమ్మ బోనాలు...

ముస్తాబాద్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మోత్రాయిపల్లె గ్రామంలో పోచమ్మ బోనాలను శనివారం ఘనంగా నిర్వహించారు. మున్నూరు కాపు సామాజిక వర్గం, ముదిరాజ్ సామాజిక వర్గం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు తీశారు. మహిళలు పెద్దఎత్తున నెత్తిన బోనాలతో శివసత్తుల పునకాలు, బైండ్లవారి ఆటల మధ్య అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ మెంగని శ్రీనివాస్, ఆయా సామాజిక వర్గ సభ్యులు, కుల సంఘం నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

బ్యాక్ బిల్లింగ్ రద్దుకు మంత్రి హామీ



మంత్రితో మాట్లాడుతున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : వస్త్ర పరిశ్రమకు సంబంధించి కరెంటు విషయంలో బ్యాక్ బిల్లింగ్‌ను రద్దు చేస్తామని చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు హామీనిచ్చారని చేనేత వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు తాటిపాముల దామోదర్ అన్నారు. శనివారం హైదరాబాద్ సచివాలయంలో సిరిసిల్ల వస్త్ర వ్యాపార పరిశ్రమకు చెందిన వివిధ సంఘాల నాయకులు మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు చెందిన సమస్యలతో పాటు కరెంటు బ్యాక్ బిల్లింగ్‌ను రద్దు చేయాలని మంత్రికి విజ్ఞప్తి చేశామన్నారు. వెంటనే స్పందించిన మంత్రి తుమ్మల నాగేశ్వర్ కరెంటు బ్యాక్ బిల్లింగ్‌ను రద్దు చేస్తామన్నారని వెంటనే రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భటి విక్రమార్కకు కరెంట్ బ్యాక్ బిల్లింగ్ ఫైల్‌ను పంపించారని అన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును నేరుగా కలవడానికి సహకరించిన మినరల్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవతిని అనిల్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇంచార్జి కేకే మహేందర్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

మంత్రిని కలసినవారిలో సిరిసిల్ల చేనేత వస్త్ర వ్యాపార సంఘం ఉపాధ్యక్షుడు ఏనుగుల ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శి గౌడ రాజు, పాలిష్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆడెపు భాస్కర్, కార్యదర్శి అంకాలపు రవి, నాయకులు బూట్ల నవీన్, బండారి అశోక్ పాల్గొన్నారు.

ఆదాయం ఘనం.. సౌకర్యాలు శూన్యం..
- సొంత భవనాల్లేని ఎక్సైజ్ స్టేషన్లు.. 8

పెట్రోల్ బంకుల్లో అక్రమాలు..
- ఆందోళనలకు దిగుతున్న వాహనదారులు 7

హాస్టల్‌కు వెళ్లమని మందలించిన తల్లిదండ్రులు

- పురుగుల మందు తాగిన విద్యార్థిని
- చికిత్స పొందుతూ మృతి


వైష్ణవి(ఫైల్)

గన్నేరువరం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కేజీబీవీహాస్టల్‌కు వెళ్లమని తల్లిదండ్రులు మందలించడంతో ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కూన సంపత్-అనితదంపతులకు కుమారుడు సంజయ్, కుమార్తె వైష్ణవి(14) సంతానం. వీరువ్యవసాయం, కూలి పనులు చేసుకుంటూ పిల్లలను స్థానిక ప్రభుత్వపాఠశాలలో చదివిస్తున్నారు. కూతురు వైష్ణవి 8వ తరగతి చదివేందుకు ఈ సంవత్సరం ఇల్లంతకుంట మండలంలోని కేజీబీవీ పాఠశాలలో సీటు రావడంతో వైష్ణవిని హాస్టల్‌కు పంపించారు. హాస్టల్‌లో ఉండి చదువుకోవడానికి వైష్ణవి ఇష్టపడకపోవడంతో తండ్రి సంపత్ ఇటీవల కూతురికి నచ్చజెప్పి మళ్లీ పంపిస్తానని ఇంటికి తీసుకు వచ్చాడు. ఈనెల23న వైష్ణవిని హాస్టల్‌లో చదువుకోవాలని తల్లిదండ్రులు మందలించి పొలం పనులకు వెళ్లిపోయారు. దీంతో మనస్థాపానికి గురైన విద్యార్థిని వైష్ణవి ఇంటివద్ద ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. తల్లిదండ్రులు ఇంటికివచ్చేసరికి వైష్ణవి వాంతులు చేసుకుంటుండగా గమనించి వెంటనే కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైనవైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. తండ్రి సంపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేందర్ రెడ్డి తెలిపారు.

బాలికను కుట్టిన తేలు

- చికిత్స పొందుతూ మృతి


మహోల(ఫైల్)

చందుర్తి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): తేలు కాటుకు గురైన ఓ బాలిక(8) చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం కిష్టంపేటలో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. మండలంలోని కిష్టంపేట గ్రామానికి చెందిన కదురిక సరిత-రమేష్‌ల కూతురు మహోల రెండు కాళ్లపై ఈనెల 19న తేలు కాటు వేసింది. దీంతో మహోల తల్లి సరిత జోగాపూర్‌కు చెందిన ఆర్ఎంపీ సంజీవ్‌కు సమాచారం ఇవ్వగా, ఆయన వచ్చి రెండు ఇంజక్షన్లు ఇచ్చి వెళ్లిపోయాడు. మరుసటి రోజు ఉదయం మహోల అపస్మారక స్థితిలోకి వెళ్లిపోగా ఆర్ఎంపీ సంజీవ్‌కు సమాచారం అందించారు. అతడి సూచన మేరకు వేములవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, అక్కడి వైద్యులు కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రికి తరలించాలని సూచించారు. కరీంనగర్‌లో చికిత్స పొందుతూ శనివారం ఉదయం చెందింది. ఆర్ఎంపీ వైద్యం వికటించడం వల్లే బాలిక మృతిచెందిందని బంధువులు ఆరోపిస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య


అజయ్‌రెడ్డి(ఫైల్)

ముస్తాబాద్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఓ పెట్రోల్ బంకులో పనిచేస్తున్న యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం జరిగింది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ముస్తాబాద్‌కు చెందిన బద్దిపడిగ విజయ-మల్లారెడ్డిలు అజయ్‌రెడ్డి(22)ని దత్తత తీసుకొని పెంచుకుంటున్నారు. అజయ్‌రెడ్డి కొంత కాలంగా మండలకేంద్రంలోని ఓ పెట్రోల్ బంకులో పనిచేస్తున్నాడు. శనివారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మహత్యకు గల వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మల్లారెడ్డి ఆరేళ్ల క్రితం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

కేంద్ర మంత్రిత్వ శాఖ దరఖాస్తుల ఆహ్వానం

బీడీ కార్మికుల పిల్లలకు ఉపకార వేతనాలు



భగత్‌నగర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఉపాధి మంత్రిత్వ శాఖ బీడీ కార్మి కుల కుటుంబాలకు ఆసరాగా నిలుస్తోంది. కార్మికుల పిల్లల విద్యాభివృద్ధికి ప్రోత్సాహం అందిస్తోంది. ఇందులో భాగంగా 2025-26 సంవత్సరానికి సంబంధించి ఉపకార వేత నాలు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. కేంద్ర ప్రభుత్వం అందించే ఉప కార వేతనాల కోసం దరఖాస్తు చేసుకో వాలని కొత్తపల్లి బీడీ కార్మిక సంక్షేమ నిధి ఆస్పత్రి వైద్యులు సూచిస్తున్నారు.

● ప్రోత్సాహకం ఇలా..

1వతరగతి నుంచి నాలుగోతరగతి వరకు రూ.1000, 5వ తరగతి నుంచి 8వ తరగతి వరకు రూ.1500, 9-10 తరగతులకు రూ.2 వేలు, ఇంటర్ రూ.3 వేలు, డిగ్రీ, ఐటీఐ, ఇ తర ప్రొఫెషనల్ కోర్సులకు రూ.6 వేలు, బీ టెక్, బీఎంఎస్ తదితర కోర్సులకు రూ.25 వేల ఉపకార వేతనాలు అందించను న్నారు.

● దరఖాస్తుకు చివరి తేదీ

ఒకటి నుంచి పదోతరగతి చదివే విద్యార్థుల ఉపకార వేతనాల కోసం ఆగస్టు 31లోపు, ఇంటర్మీడియెట్, డిగ్రీ, ఐటీఐ, ప్రొఫెసల్ కోర్సుల విద్యార్థులు అక్టోబరు 31లోపు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. పూర్తి వివరాలకు 040-25561297 నంబరులో సంప్రదించాలి.

● ఉపకార వేతనాలకు అర్హతలు

పీఎఫ్ ఐడీ కార్డు తప్పనిసరి. విద్యార్థుల పేరున బ్యాంక్ పాస్ బుక్ ఉండాలి. గతేడాది మార్కుల మెమో జత చేయాలి. 2025-26 సంవత్సరానికి సంబంధించిన ఆదాయ ధ్రువీకరణ పత్రం సమర్పించాలి. నెలకు కనీసం రూ.10 వేల ఆదాయం మించి ఉండరాదు. కార్మికులకు ఇద్దరు పిల్లలు కలిగి ఉండి ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే విడి విడిగా వారి వారి పేర్లపై బ్యాంక్ అకౌంట్ తీయాలి. పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో నేరుగా ఉత్తీర్ణత సాధించిన వారే అర్హులు. సప్లిమెంటరీలో పాస్ అయిన వారు అనర్హులు. దూర విద్యనభ్యసించే వారికి దరఖాస్తు చేసుకునే అవకాశం లేదు.

సద్వినియోగం చేసుకోవాలి
- డాక్టర్ కె.అనూషరాణి, బీడీ కార్మిక సంక్షేమ నిధి వైద్యురాలు, కొత్తపల్లి

ఉపకార వేతనాలకోసం అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి. కేంద్ర ప్రభుత్వం అందించే చేయూతను సద్వినియోగం చేసుకొని చదువులో రాణించాలి.

రామగుండం సీపీ అంబర్ కిశోర్‌కు ఉత్కృష్ట సేవా పతకం


సీపీ అంబర్ కిశోర్ ఝా

కోల్‌సిటీ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝాకు కేంద్ర ప్రభుత్వం ఉత్కృష్ట సేవా పతకాన్ని ప్రకటించింది. పోలీస్‌శాఖలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు కేంద్రం ఈ పథకాన్ని ఇస్తుంది. 2009 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి అంబర్ కిశోర్ ఝా వివిధ హోదాల్లో సుదీర్ఘకాలం వృత్తిపరమైన నైపుణ్యంతో విధులు నిర్వర్తించినందుకు గాను ఈ పతకానికి ఎంపిక చేశారు. ఉత్కృష్ట సేవా పతకానికి ఎంపికైన సీపీ అంబర్ కిశోర్ ఝాను అధికారులు, సిబ్బంది అభినందించారు.

చోరీ కేసును ఛేదించిన పోలీసులు


దొంగను అరెస్టు చూపుతున్న పోలీసులు

మంథని, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మంథని పట్టణంలో జరిగిన చోరీ కేసును పోలీసులు వారంలోపే ఛేదించారు. చోరీకి పాల్పడిన తిరునహరి రాజనర్సింహస్వామి అనే దొంగను అరెస్టు చేసినట్లు సీఐ రాజు శనివారం తెలిపారు. మంథనిలోని ఇల్లెందుల వెంకటేశ్వర్లు అనే వ్యక్తి ఈనెల 22న హైదరాబాద్‌కు వెళ్లి ఈనెల 24న తిరిగి ఇంటికి రాగా ఇంట్లో చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా సీసీ కెమెరాలు పరిశీలించగా మంథనికి చెందిన తిరునహరి రాజనర్సింహస్వామిగా గుర్తించి అరెస్టు చేసి రిమాండ్ చేశామన్నారు. అతని నుంచి దొంగిలించిన వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. కేసు ఛేదించిన ఎస్ఐ రమేష్, ఏఎస్ఐ స్వామి, పీసీలు రమేష్, రాజ్‌కుమార్, శివ, అశోక్‌లను సీఐ రాజు అభినందించారు.

బాలిక మృతికి కారణమైన.. ఆర్ఎంపీ రిమాండ్


ఆర్ఎంపీని అరెస్టు చూపుతున్న ఏఎస్పీ చంద్రయ్య

చందుర్తి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): బాలిక మృతికి కారణమైన ఆర్ఎంపీ సంజీవ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్పీ చంద్రయ్య తెలిపారు. తేలుకాటుకు గురైన బాలికకు వైద్యం అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆర్ఎంపీని చందుర్తి పోలీస్ స్టేషన్‌లో పోలీసులు అరెస్టు చూపారు. ఈ సందర్భంగా ఏఎస్పీ చంద్రయ్య మాట్లాడుతూ ఈనెల 19న కిష్టంపేట గ్రామానికి చెందిన మహోలకు తేలుకాటు వేసిందన్నారు. బాలికకు నిర్లక్ష్యంగా వైద్యం చేసి అపస్మారక స్థితిలోకి వెళ్లేందుకు కారకుడైన జోగాపూర్‌కు చెందిన ఆర్ఎంపీ సంజీవ్‌పై ఈనెల 25న బాలిక తల్లి సరిత చందుర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందన్నారు. విచారణ జరిపి ఆర్ఎంపీపై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసు నమోదు చేసి ఆర్ఎంపీ సంజీవ్‌ను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, రమేష్ పాల్గొన్నారు.

ఇద్దరు దొంగల అరెస్టు


దొంగను అరెస్టు చూపుతున్న పోలీసులు

జగిత్యాల క్రైం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని శ్రీరాంనగర్‌లో బంగారు నగలు అపహరించిన ఇద్దరు దొంగలను జగిత్యాల పట్టణ పోలీసులు శనివారం రాత్రి పట్టుకున్నారు. నిందితుల వద్ద 3.6గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని పట్టణ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ వివరాలు వెల్లడించారు. జిల్లాకేంద్రంలోని ధర్మపురి బైపాస్‌రోడ్‌లో పట్టణ పోలీసులు రాత్రి సమయంలో వాహనాల తనిఖీ చేస్తున్న సమయంలో గుర్తుతెలియని ఇద్దరువ్యక్తులు పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేయగా పట్టుకున్నారు. పట్టుబడిన వ్యక్తులు పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన సుమంత్‌తోపాటు ఓమైనర్ బాలుడు ఉన్నారు. విచారణలో వీరు జగిత్యాల పట్టణంలోని శ్రీరాంనగర్‌లో చాంద్‌బీ అనే వృద్ధురాలిపై దాడి చేసి ఆమె మెడలో ఉన్న 3.6గ్రాముల బంగారు నగలు దోచుకువెళ్లినట్లు గుర్తించి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఏఎస్సై వెంకటేశ్వర్ రావు తదితరులు ఉన్నారు.

బైక్ దొంగ అరెస్టు

మంథని, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): బైక్‌చోరీ కేసులో మండలంలోని అడవిసోమన్‌పల్లి గ్రామానికిచెందిన రత్నంరాజ్‌కుమార్‌ను అరెస్టు చేసినట్లు సీఐ రాజు శనివారం తెలిపారు. తాడిచర్లలో హెచ్‌ఎంగా పనిచేస్తున్న చీర్ల తిరుపతిరెడ్డి ఈ నెల 27న స్థానిక పాతపెట్రోల్ పంపు వద్ద తన ఏపీ-15 ఏడీ7688బైక్‌ను పార్క్‌చేసి ఈనెల28న తిరిగి వచ్చి చూడగా బైక్ కనిపించక పోవడంతో స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ రమేష్ కేసు నమోదు చేసి బైక్ దొంగిలించిన రాజ్‌కుమార్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు.

ఇంటి నంబర్ కోసం ఏడాదిగా పాట్లు

- ఏసీబీని ఆశ్రయించిన బాధితుడు
- ఇద్దరు మున్సిపల్ ఉద్యోగుల పట్టివేత


ఏసీబీకి పట్టుబడ్డ ఇద్దరు ఉద్యోగులు

సుల్తానాబాద్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ ఆర్టీసీ బస్‌స్టాండ్ వెనుక ఇల్లు కట్టుకుని రెండేళ్లు అవుతోంది. ఇంటి నెంబర్ కోసం ఏడాదిగా తిరుగుతున్నా. రేపు మాపు అంటూ చివరకు పది వేలు లంచం ఇస్తేనే ఇంటి నెంబర్ కేటాయిస్తామన్నారు. అధికారుల తీరుపై విసిగి ఏసీబీ అధికారు లను ఆశ్రయించినట్లు బాధితుడు అర్నకొండ ప్రసాద్ తెలిపారు. సుల్తానాబాద్‌లోని పూసాల రోడ్డులో ఓ ఎలక్ట్రికల్ షాప్‌లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి బిల్ కలెక్టర్ విజయ్ ఐదు వేల రూపాయలు బాధితుడు అర్నకొండ ప్రసాద్ నుంచి తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతన్ని మున్సిపాలిటీ కార్యాలయానికి తీసుకు వచ్చి విచారించారు. ఆర్ఐ వినోద్, బిల్ కలెక్టర్ విజయ్ ఇద్దరు బాధితుడి నుంచి డబ్బులు డిమాండ్ చేసినట్లు నిర్ధారించుకుని లంచం డబ్బులను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరినీ అరెస్టు చేశారు. వీరిని ఏసీబీ కోర్టులో హాజరు పరుస్తామని ఏసీబీ డీఎస్పీ తెలిపారు.

బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రం దోపిడీకి గురైంది

- రాష్ట్రాన్ని దోచినోడిని జాతిపిత, బాపూజీ అని ఎలా అంటారు?
- కాళ్లేశ్వరం ప్రాజెక్టులో రూ. 80వేల కోట్లు కేసీఆర్ దోచాడు
- ఈ-కారు రేసులో రూ.49 కోట్లు బీఆర్ఎస్ పార్టీ ఫండ్‌కు..
- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గజ్జెల కాంతం


సిరిసిల్లలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సిరిసిల్ల టౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వంలో రాష్ట్రం దోపిడీకి గురైందని టీపీసీసీ ప్రధానకార్యదర్శి గజ్జెల కాంతం ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి 140సంవత్సరాల చరిత్ర ఉందని, కేటీఆర్ తాటాకు చప్పుళ్లకు భయపడేటోళ్లు లేరని అన్నారు. శనివారం రాజన్నసిరిసిల్ల జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో మాజీప్రధాని పీవీ నర్సింహారావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. టీపీసీసీకార్యదర్శి గజ్జెల కాంతం, కాంగ్రెస్ నాయకులు పీవీ నర్సింహారావు చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం విలేకరుల సమావేశంలో గజ్జెలకాంతం మాట్లాడారు. 4కోట్లప్రజలు సంతోషంగా జీవిస్తారని సోనియాగాంధీ తెలం గాణ ఇస్తే పది సంవత్సరాల్లో బీఆర్ఎస్ ప్రభు త్వంలో రాష్ట్రం దోపిడీకి గురైందని ఆరోపించారు. కేటీఆర్ ఎమ్మెల్యేగా, మంత్రిగా సిరిసిల్లలో మాఫి యాలను తయారుచేసి కోట్లాది రూపాయలను అనుచరవర్గం సంపదించుకుందన్నారు. ప్రధానమంత్రిగా ఇందిరాగాంధీ ఉన్నప్పుడు తెలంగాణ ప్రాంతంలో 15లక్షల ఎకరాల భూమిని పంపిణీ చేశారని, కేసీఆర్ ముఖ్య మంత్రి అయ్యాక ఆ భూములను కబ్జాలు పెట్టి వేలకోట్లు ఆయన కుటుంబం సంపాదించుకుందని ఆరోపించారు. కేసీఆర్ వచ్చాకే తెలంగాణ ఉద్యమం మొదలు కాలేదని, 1969లో మొదలై అనేకమంది ఉద్యమాన్ని నడిపించారన్నారు. 2001లో భూ స్వాములతో కలిసి రాజకీయం, అధికారం కోసం పార్టీ పెట్టిన కేసీఆర్ నాడు కాంగ్రెస్, టీడీపీలో పొత్తు పెట్టుకున్నాడని, తెలంగాణ రాష్ట్రంకోసం పార్టీ పెట్టలేదని ఆరోపించారు.

తెలంగాణ జాతిపిత, బాపూజీ అంటే కొండా లక్ష్మణ్‌బాపూజీ, ప్రొఫెసర్ జయశంకర్‌ను అనాలన్నారు. రాష్ట్రాన్ని దోచినోడిని జాతిపిత, బాపూజీ అని ఎట్లా అంటారని ప్రశ్నించారు. ఉద్యమంలో శ్రీకాంత చారి చనిపోవడానికి కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు కారణమని ఆరోపించారు. సోనియా గాంధీ తెలంగాణ ఇవ్వకుంటే కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యేవాడు కాదన్నారు. దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన కాంగ్రెస్ పార్టీ, తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఇష్టమొచ్చినట్లు కేటీఆర్ మాట్లాడితే చేతులు కట్టుకొని కూర్చుండబోమన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును రూ.70వేలకోట్ల ఖర్చుఉంటే కేసీఆర్ రూ.150వేల కోట్లకు కేసీఆర్‌పెంచి రూ.80వేల కోట్లు దోచాడని, కాంగ్రెస్ ప్రభుత్వం కమిషన్‌వేసి విచారణ జరుపు తోందన్నారు. ఈ-కారు రేసులో రూ.650కోట్లు కంపెనీలతో ఒప్పందం చేసుకొని రూ.49కోట్లు బీఆర్ఎస్ పార్టీఫండ్ కోసం తీసుకు న్నాడని ఆరోపించారు.

ఈ సమావేశంలో కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ప్రధానకార్యదర్శి మ్యాన ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు మల్లేశంగౌడ్, ఎండీఖాజా, ప్రధాన కార్య దర్శి వెంగళ అశోక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు దుమాల వెంకటేశం, కే రాజు, ఆడెపు జగన్, మాజీ కౌన్సిలర్లు కుడికాల రవికుమార్,వేముల రవి, రాగుల జగన్, కత్తెర దేవదాస్, ఆడెపు ప్రభాకర్, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ మాజీ వైస్‌చైర్మన్ నీలి రవీందర్, మాజీడైరెక్టర్ నేరెళ్ల శ్రీకాంత్‌గౌడ్, మాలమహానాడు జాతీయ కార్యదర్శి రాగులరాములు, నాయకులుబొప్ప దేవయ్య, ధర్మేం దర్, శివరాజ్, ఎండీ అహ్మద్, గోనె ఎల్లప్ప, రంగ కిషన్, బీమారం శ్రీనివాస్, బైరి ప్రభాకర్, భాస్కర్, గుజ్జె రమేష్ పాల్గొన్నారు.

వరకట్నం కోసం.. వేధిస్తున్న వ్యక్తిపై కేసు

మల్యాల, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): అదనపు వరకట్నం కోసం వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. ఆయనతెలిపిన వివరాల ప్రకారం మండలంలోని నూకపల్లికి చెందిన నులిగొండ అలియాస్ మరిశెట్టి సుప్రియకు జగిత్యాల మండలం జాబితాపూర్‌కు చెందిన గంగమహేశ్‌తో నాలుగు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కూతుళ్లు కాగా కొన్నా ళ్లుగా సుప్రియను భర్త వరకట్నం కోసం వేధిస్తుండడంతో ఆమె మల్యాల పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ప్రమాదకరంగా వ్యవసాయ బావులు..

పట్టించుకోని అధికారులు


రాఘవాపూర్‌లో ప్రమాదకరంగా ఉన్న వ్యవసాయబావి

మానకొండూర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని మానకొండూర్-జమ్మికుంట ప్రధాన రహదారి పక్కన వ్యవసాయబావి ప్రమాదకరంగా ఉంది. మానకొండూర్ నుంచి జమ్మికుంట వరకు డబుల్ రోడ్డు నిర్మాణంలో భాగంగా వెడల్పు చేసి తారు రోడ్డును నిర్మించారు. అయితే మండల కేంద్రం నుంచి పచ్చునూర్ వరకు సుమారు 16కిలోమీటర్ల వరకు రోడ్డు వెంబడి సుమారు 10కి పైగా వ్యవసాయబావులు ఉన్నాయి. ఈ రోడ్డు వెంబడి ఆర్టీసీ బస్సులతో పాటు లారీలు, ఆటోలు, వందలాది ద్విచక్ర వాహనాలు నిత్యం నడుస్తుంటాయి. బావులు రోడ్డు పక్కన 20మీటర్ల లోతు వరకు ఉండి పూర్తి స్థాయిలో నీరు ఉండడంతో ప్రయాణికులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణిస్తున్నారు. రోడ్డు నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్ బావుల వద్ద ఎలాంటి రక్షణ గోడ నిర్మించలేదు. కనీసం ప్రమాద సూచికలు ఏర్పాటు చేయకపోవడంపై ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి వ్యవసాయబావుల వద్ద ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వ్యవసాయ మోటార్ల దొంగతనం

జగిత్యాలరూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలఅర్బన్ మండలం తిప్పన్నపేట గ్రామ పంచాయతీ పరిధి గోపాల్‌రావుపేటలోని పెద్ద పులివాగు సమీపంలోని పొలాలవద్ద గల ఐదు వ్యవసాయ విద్యుత్‌మోటార్లను శుక్రవారం రాత్రి దొంగలు ఎత్తుకెళ్లినట్లు బాధిత రైతులు అత్తినేని గంగాధర్, రౌతు శేఖర్, దావ శంకర్, కొల్లూరి రవీందర్, అత్తినేని గంగన్న తెలిపారు. మోటార్లు లేకపోవడంతో నారుమడులు ఎండిపోయే ప్రమాదం ఉందని ఆవేదనవ్యక్తం చేశారు. పోలీసులకు బాధిత రైతులు ఫిర్యాదు చేశారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వీణవంక, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో పోలీసులు ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టు ఏర్పాటుచేసి తనిఖీలు చేస్తుండగా కొర్కల్ మానేరువాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న పదిట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై ఆవుల తిరుపతి తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఎద్దుల దొంగలు పట్టివేత

వీణవంక, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్భాపూర్ గ్రామానికి చెందిన బావు రవికి చెందిన ఎద్దులను ఈ నెల19వ తేదిన దొంగలు వ్యవసాయపొలం నుంచి తోలుకుపోయారు. దీనిపై బావు రవి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు ప్రత్యేకబృందాన్ని ఏర్పాటుచేసి దర్యాప్తుచేశారు. శనివారం ఎద్దులను దొంగలించిన ముగ్గురిని పట్టుకొని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. తడిగొప్పుల అజయ్, మిడిదొడ్డి అభిలాష్‌తోపాటు బాలున్ని అరెస్టు చేశామన్నారు. ఎద్దులను పోలీసులు బాధితుడు రవికి అప్పగించారు.

పెట్రోల్ బంకుల్లో అక్రమాలు..

- ఆందోళనలకు దిగుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు


ఆందోళన చేస్తున్న వాహనదారులు(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలంలోని పలు పెట్రోలు బంకుల్లో తూకాల్లో అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. కొన్నిచోట్ల లీటరు పెట్రోలు పోయించుకుంటే 900 నుంచి 950 ఎంఎల్ మాత్రమే వస్తోంది. బంకుల్లో ఇంధనం నిల్వ చేసే భూగర్భ ట్యాంకుల నిర్వహణ సక్రమంగా లేక నీరు కలుస్తోంది. తూకాల్లో వ్యత్యాసం, నీరు వస్తుండడం వల్ల వాహనదారులు ఆందోళనలకు దిగుతున్నారు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.


పెట్రోలులో వచ్చిన నీరు

● నిబంధనలు గాలికి..

మండల కేంద్రంతో పాటు రాచర్లగొల్లపల్లి, కోరుట్లపేట, అల్మాస్‌పూర్, వెంకటాపూర్ గ్రామాల్లో ఆయా సంస్థలకు సంబంధించిన డీజిల్, పెట్రోలు బంకులున్నాయి. ఏళ్లుగా నిర్వహణ లేకపోవడంతో బంకుల్లో పెట్రోలుతో పాటు నీళ్లు వస్తున్నాయి. ఇటీవల వాహనదారులు బంకుల్లో ఆందోళనలకు దిగిన ఘటనలు ఉన్నాయి. మరోవైపు పెట్రోలు బంకుల్లో ఆటోమేటిక్ వ్యవస్థను ప్రవేశపెట్టడంతో కొలతల్లో తేడా ఉండదని వాహనదారులు భావిస్తున్నారు. అయితే కొలతల్లో వ్యత్యాసం వచ్చేలా యజమానులు యంత్రాలను సరిచేస్తున్నట్లు తెలుస్తోంది. లీటరుకు 50 నుంచి 100 ఎంఎల్ తక్కువ వస్తోంది. కొందరు వాహనదారులు గుర్తించి యజమానులతో గొడవకు దిగడంతో సర్దిచెప్పి తప్పించుకుంటున్నారు. వాహనదారులు లీటర్ల చొప్పున కాకుండా డబ్బుల వారిగా పోయించుకోవడం బంకు యజమానులకు మరింత కలిసి వస్తోంది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు బంకుల్లో తనిఖీలు నిర్వహించి అక్రమాలను అరికట్టాలని కోరుతున్నారు.

వాహనం చెడిపోతోంది..
- హబీబ్, వాహనదారుడు



బంకుల్లో పోయించుకున్న పెట్రోలు కల్తీ కావడం వల్ల వాహనం స్టార్ట్ కావడం లేదు. లీటరు పోయిస్తే తక్కువ వస్తోంది. పెట్రోలులో నీళ్ల వస్తున్నాయి. వాహనం చెడిపోతోంది. వాహనం రిపేరు చేయించుకోవాల్సిన పరిస్థితి వస్తోంది. అధికారులు బంకుల్లో తనిఖీలు చేయాలి.



మల్లు రవిని కలిసి లేఖను అందజేస్తున్న కొండా మురళి

వారంలోగా వివరణ ఇవ్వాలి

- క్రమశిక్షణ కమిటీ అడిగిన ప్రశ్నలపైనే ఇవ్వండి.. కొండా మురళిని ఆదేశించిన పీసీసీ క్రమశిక్షణ కమిటీ
- 150కి పైగా వాహనాల్లో భారీ అనుచరగణంతో గాంధీభవన్‌కు మురళి
- క్రమశిక్షణ కమిటీకి 6 పేజీల లేఖ.. కడియం సహా ఇతర నేతలపై ఆరోపణలు

హైదరాబాద్, వరంగల్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ నేతల పరస్పర ఫిర్యాదులపై విచారణ చేపట్టిన టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ వారం రోజుల్లో లిఖితపూర్వకంగా వివరణ ఇవ్వాలని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళిని ఆదేశించింది. శనివారం గాంధీభవన్‌లో మల్లురవి అధ్యక్షతన టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ సమావేశమైంది. ప్రధానంగా వరంగల్ జిల్లాలోని సొంత పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ముఖ్య నాయకులపై మురళి చేసిన వ్యాఖ్యలపై ఆయన్ను కమిటీ వివరణ కోరింది. అదేరోజు మురళి 150కి పైగా వాహనాల్లో భారీ అనుచరగణంతో గాంధీభవన్‌కు చేరుకొని ఆరుపేజీల లేఖను కమిటీ చైర్మన్ మల్లురవికి అందజేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఎమ్మెల్యేలతో తనకు ఉన్న విభేదాలు, సఖ్యతపై లేఖలో మురళి వివరించారు. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి పార్టీకి తీవ్ర నష్టం కలిగిస్తున్నారని లేఖలో ఆరోపిస్తూ గతంలో వారిపై తాను చేసిన వ్యాఖ్యలను సమర్థించుకున్నారు. అయితే క్రమశిక్షణ కమిటీ అడిగిన అంశాలపైనే తాము వివరణ కోరుతున్నట్లు మురళికి చైర్మన్ మల్లురవి స్పష్టం చేసినట్లు తెలిసింది. జిల్లాకు చెంది న ముఖ్యనాయకులపై చేసిన ఆరోపణలకు వారం రోజుల వ్యవధిలో రాతపూర్వకంగా వివరణ ఇవ్వాల ని మురళిని ఆయన ఆదేశించారు. అనంతరం మల్లురవి మాట్లాడుతూ.. మురళి తాను చెప్పదలచుకున్న అంశాలను లేఖ రూపంలో అందజేశారని వెల్లడించారు. తాము అడిగిన విషయాలపై వారం రోజుల్లో రాతపూర్వకంగా ఆయన వివరణ పంపితే తదుపరి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఎలాంటి ఒత్తిడులకు లొంగే ప్రసక్తి లేదన్నారు.

పార్టీ మారితే విలువలు పాటించాలి: మురళి

బీఆర్ఎస్ ఎమ్మెల్సీగా ఉన్న తాను ఆ పదవికి రాజీనామా చేసిన తర్వాతే కాంగ్రెస్‌లోకి వచ్చానని కొండా మురళి చెప్పారు. కడియం శ్రీహరి కూడా తన మాదిరిగానే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారని, అయితే ఆయన తన పదవికి రాజీనామా చేస్తారా? లేదా? అనేది ఆయనే నిర్ణయించుకోవాలన్నారు. పార్టీ మారేటప్పుడు నాయకులు విలువలు పాటించాలని సూచించారు. కడియం పార్టీలోకి వచ్చాకే సమస్యలు మొదలయ్యాయని ఆరోపించారు. కొండా సురేఖకు, సీతక్కకు గ్యాప్ ఏర్పడిందని కడియం ప్రచారం చేశారన్నారు. మంత్రి పొంగులేటి ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉండి, తన సతీమణి కొండా సురేఖపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. నాయిని రాజేందర్‌రెడ్డిని, ఎమ్మెల్సీ సారయ్యలతో కలిసి పొంగులేటి తమ వరంగల్ తూర్పు నియోకవర్గంలో తిరుగుతున్నారని, అయినప్పటికీ వారికి తాము ఎలాంటి ఇబ్బంది కలిగించలేదని తెలిపారు. రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేయటమే తన లక్ష్యమని, సీఎం రేవంత్‌రెడ్డి అంటే అభిమానమని పేర్కొన్నారు.

అభివృద్ధి దైవకార్యం

(మొదటిపేజీ తరువాయి)

మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌లతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభ లో రేవంత్ మాట్లాడారు. రాజకీయ అవకాశవాదంతో ప్రభుత్వ కార్యక్రమాలనడ్డుకునే వారిని క్షమించుకుంటు పోదామా? అని రాష్ట్ర ప్రజలను ప్రశ్నించారు. ప్రజలు తీర్పు ఇచ్చి తమకు ఐదేళ్లు పాలించే అవకాశం ఇచ్చారని, ప్రజలెన్నుకున్న ప్రభుత్వాన్ని పనులు చేయకుండా కోర్టులో లిటిగేషన్ వేసి ప్రతిపక్షాలు నగరాభివృద్ధిని అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. నాలెడ్జ్ పార్క్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌కి కొనసాగింపుగా గచ్చిబౌలి స్టేడి యం పక్కన 400 ఎకరాలు అభివృద్ధి చేస్తే మరో 5 లక్ష ల మందికి ఉద్యోగావకాశాలు కల్పించవచ్చని ఆశించామని తెలిపారు. అమెరికా, సింగపూర్, జపాన్, దక్షిణ కొరియాల్లో పర్యటించి దాదాపు రూ.2.25 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించి, సంస్థలను ప్రారంభించేందుకు ప్రయత్నిస్తే పానకంలో పుడకలా అడ్డుకుంటున్నారని చెప్పారు. తాత్కాలికమైన ఈ అవాంతరాలతో ప్రభు త్వం వెనక్కి తగ్గదని, చట్టసభల్లో, న్యాయస్థానాల్లో కొట్లాడి అక్కడే పెద్ద ఎత్తున ఐటీ కంపెనీలు ప్రారంభించి, లక్షల మందికి ఉపాధి కల్పిస్తామని ప్రకటించారు. తమ ప్రభుత్వ ప్రస్తుత ఎజెండా అభివృద్ధేనని, ఎన్నికలప్పుడు తప్ప రాజకీయాలు చేయదలచుకోలేదన్నారు. తెలంగాణ ప్రజలు బీజేపీ వాళ్ల ఏదో బాగు చేస్తారని నమ్మి ఆ పార్టీ నుంచి సగం మంది ఎంపీలను గెలిపిస్తే రాష్ట్రానికి మోదీ మొండి చేయి ఇచ్చారని రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. రాష్ట్రానికి ఏం తెచ్చారో గుండెమీద చేయి వేసుకొని ఆలోచించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కోరారు. "విపక్షాల పాలనలోని బెంగళూరు, చెన్నైలకు మెట్రో ప్రాజెక్టులిచ్చారు. ఏపీకి మెట్రో.. గుజరాత్ బుల్లెట్ రైలుకు 2లక్షల కోట్లు ఇచ్చారు. అహ్మదాబాద్‌కు సబర్మతి రివర్ ఫ్రంట్, ఢిల్లీకి యమునా రివర్ ఫ్రంట్, యుపీకిగంగా రివర్ ఫ్రంట్ ఇచ్చారు. తెలంగాణ మూసీ రివర్ ఫ్రంట్ అడిగితే ఇవ్వలేదు. మెట్రో రైల్ ఇవ్వలేదు. రీజనల్ రింగ్ రోడ్డు అటకెక్కింది. ఎందుకీ వివ క్ష?" అని కిషన్‌రెడ్డిని నిలదీశారు. "భేషజాలు లేకుండా నగరాభివృద్ధి కోసం బీజేపీ నేతల వెంట వస్తానని చెప్పా. 35 సార్లు ఢిల్లీకి వచ్చా. మోదీని, అమిత్‌షాను కలిశా. నేను కలవని కేంద్ర మంత్రి లేడు. చేయని విజ్ఞాపన లేదు. రేపు వస్తున్న అమిత్ షాకు ఎయిర్ పోర్టులో స్వాగ తం పలికి మెట్రో, మూసీ రివర్ ఫ్రంట్, రీజనల్ రింగ్ రోడ్డు అడుగుతాం" అన్నారు. "ఈ 3 ఇస్తే హైదరాబాద్ ప్రపంచం తో పోటీ పడుతుం ది. న్యూయార్క్‌లోని వా ళ్లు హైదరాబాద్‌కొ చ్చి నివసిస్తాం, ఫ్యూచర్ సిటీ లో వ్యాపారం చేసుకుంటామంటామనేలా హైదరాబాద్ తయారవుతుం ది. హాలీవుడ్, బాలీవుడ్‌ను తీసుకువస్తాం. మీ వంతు సహకరించండి. మా వైపు లోపముంటే చెప్పండి, సరిదిద్దుకుంటాం. నివేదికల్లో లోపముందా? మేం కోరుతున్నది గొంతెమ్మ కోర్కెలా? చెప్పాలి" అని కేంద్రాన్ని కోరారు.

కిషన్‌రెడ్డి ఇంటికి వెళ్లి కలిశా

హైదరాబాద్ 20 ఏళ్ల కిందట మెట్రోకి, 25 ఏళ్ల కింద ఔటర్ రింగ్ రోడ్డుకు, అంతర్జాతీయ విమానాశ్రయానికి పునాదులు వేసుకొని, వందేళ్ల క్రితమే మూసీ రివర్ ఫ్రంట్ కట్టుకుందని రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు. మెట్రో విషయంలో ఢిల్లీ తరువాత రెండో స్థానంలో ఉన్న హైదరాబాద్ ఇప్పుడు తొమ్మిదో స్థానానికి పడిపోయిందని, చిన్న చిన్న నగరాలు మెట్రో కట్టుకొని హైదరాబాద్‌ను దాటిపోతుంటే కనబడటం లేదా? అని ప్రశ్నించారు. ఢిల్లీలో కిషన్‌రెడ్డి ఇంటికి వెళ్లి ఆయన సహకరిస్తే నాలుగేళ్ల హైదరాబాద్‌ను అభివృద్ధి చేసుకుందామని విజ్ఞప్తి చేశానన్నారు. ఎవరివి రాజకీయాలు? ఎవరివి కుట్రలు? అని ప్రశ్నించారు. కోర్ అర్బన్, సెమీ అర్బన్ రీజియన్లు, రూరల్ తెలంగాణలో ప్రణాళిక బద్ధమైన అభివృద్ధి కోసం డిసెంబరు 9 లోపు విజన్ డాక్యుమెంట్ విడుదలతో, 100 ఏళ్లకు అవసరమైన ప్రణాళికలు రూపొందిస్తామని రేవంత్‌రెడ్డి ప్రకటించారు. దేశ రాజధాని ప్రజలు నివసించలేని పరిస్థితి వచ్చిందంటే ఢిల్లీలో సరైన ప్రణాళికలు లేక పోవడమే కారణమన్నారు. "వర్షాలు వస్తే చెన్నై అతలాకుతలం, ట్రాఫిక్ ఇబ్బందులతో ఎయిర్ పో ర్టుకు వెళ్లాలంటే బెంగళూరులో 6 గంటల ముందు బ యల్దేరాలి. ఇతర నగరాల నుంచిగుణపాఠాలు నేర్చుకోవాలి. న్యూయార్క్, టోక్యో, సింగపూర్‌లతో పోటీ పడాలి" అన్నారు. కేంద్రంతో మాట్లాడి ఏడాదిలో 3,000 ఎలక్ట్రిక్ బస్సులను నగరానికి అందిస్తామన్నారు.

నాయకులకు స్ఫూర్తి పీజేఆర్

జంట నగరాలలో 20-25 యేళ్లు పీజేఆర్ శకం నడిచిందని, ఉపాధి కోసం ఎవరు నగరానికి వచ్చినా వారికి అండగా నిలబడి నిజమైన ప్రజానేతగా పని చేశారని సీఎం కొనియాడారు. ఆయన పోరాటం వల్లే నగర దాహార్తిని తీర్చేందుకు కృష్ణా, మంజీరా, సింగూరు జలాలు వచ్చాయన్నారు. హైటెక్ సిటీని మహారాష్ట్రకు తరలించే కుట్రలు జరిగినపుడు స్థానిక ఎమ్మెల్యేగా పీజేఆర్ అడ్డుకున్నారని చెప్పారు. ఏవీ కళాశాలలో తాను చదువుకొనే రోజుల్లో పక్కనే పీజేఆర్ ఇల్లు జనతా గ్యారేజీలాగా పని చేస్తూ ఉండేదని గుర్తు చేసుకున్నారు. పీజేఆర్ వంతెనకు సమీపంలో ఆయన విగ్రహం ఏర్పాటుకు స్థలం చూడాలని ఆదేశించారు.

ఆనాడు నవ్వారు

విమానాశ్రయం అవతల లక్షల ఎకరాలు అందుబాటులో ఉన్నందునే 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీ ప్లాన్ చేశామని సీఎం చె ప్పారు. ఎయిర్‌పోర్టు నుంచి మెట్రోరైల్‌తో పా టు పెద్ద హైవే కారిడార్లు నిర్మిస్తామన్నారు. 20 వేల ఎకరాలు ఓపెన్ ఏరియా, 15 వేల ఎకరాలు పార్కులతో కాలుష్యం లేని నగరం నిర్మిస్తామన్నారు. 15 వేల ఎకరాల్లో రోడ్లు, భవనాలుంటాయన్నారు. చంద్రబాబు, వైఎస్ హైటెక్ సిటీ, అంతర్జాతీయ విమానాశ్రయం, ఔటర్ రింగ్ రోడ్డుల అభివృద్ధికి పూనుకున్నపుడు అంతా నవ్వారని, ఈ రోజు అభివృద్ధిని మనం కళ్లారా చూస్తున్నామని అన్నారు."నాలాల అడ్డంకులు తొలగించి చెరువుల కబ్జాలకు విముక్తి కలిగిస్తున్నాం, రోడ్లు వెడల్పు చేస్తున్నాం. వంతెనలు, అండర్‌పాస్‌లు కడుతు న్నాం. అన్యాయంగా ఆక్రమించుకొని చెరువుల్లో కట్టిన నిర్మాణాలను హైడ్రాతో తొలగిస్తున్నాం" అని సీఎం రాజధానిలో ప్రభుత్వ కార్యక్రమాలను ఏకరువు పెట్టారు. నాగార్జున ఎన్ కన్వెన్షన్‌నూ తొలగించినా, తర్వాత ప్రభుత్వ మంచి కార్యక్రమాన్ని గుర్తించి ఆయనే స్వయంగా తనను కలిసి రెండెకరాలను చెరువు అభివృదికి అప్పగించారన్నారు. నగరాభివృద్ధిలో ఒక హీరోగా ముందుంటానని నాగార్జున చెప్పారని, సీఎం గుర్తు చేశారు. బతుకమ్మ కుంట కోసం వీహెచ్ పోరాడుతున్నారని, బీఆర్ఎస్ నేతలు ఆక్రమించుకుంటే హైకోర్టులో కొట్లాడి ఆరెకరాల్లో అభివృద్ధి చేస్తున్నామన్నారు. 2029 నియోజకవర్గాల పునర్విభజనలో శేరిలింగంపల్లి నాలుగైదు అసెంబ్లీ సెగ్మెంట్లుగా మారుతుందని సీఎం అన్నారు. నలుగురైదుగురు కొత్త ఎమ్మెల్యేలను తయారు చేసే బాధ్యతను ఎమ్మెల్యే గాంధీ తీసుకోవాలన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా డాక్టర్ నోరి దత్తాత్రేయుడు

ప్రపంచ ప్రఖ్యాత క్యాన్సర్ వైద్య నిపుణులు(అంకాలజిస్టు) డాక్టర్ నోరి దత్తాత్రేయుడు తెలంగాణ ప్రభుత్వ సలహాదారుగా నియమితులయ్యారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు శనివారం జారీ చేశారు. రాష్ట్రంలో క్యాన్సర్ వ్యాధి నివారణ, ముందస్తు చికిత్స, మెరుగైన వైద్యసేవల అంశాల్లో ఆయన సహకారం తీసుకునేందుకు ప్రభుత్వం ఈ నియమాకం చేపట్టింది. డాక్టర్ దత్తాత్రేయుడు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఇటీవల స్వయంగా కలిసిన సంగతి తెలిసిందే.

దేశ ఆర్థిక వృద్ధిలో పీవీ పాత్ర కీలకం

- ప్రధాని నరేంద్ర మోదీ
- ఆర్థిక సరళీకరణతో చెరగని ముద్ర: ఖర్గే
- పీవీ సేవలు చిరస్మరణీయం: రేవంత్ రెడ్డి
- పీవీ ఇక్కడ పుట్టడం మన అదృష్టం: భట్టి
- బహుభాషా కోవిదుడు పీవీ: ఎంపీ లక్ష్మణ్
- విద్యారంగానికి ఎనలేని సేవలు: కేటీఆర్



పీవీ ఘాట్ వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క

న్యూఢిల్లీ/ హైదరాబాద్/ రాంగోపాల్‌పేట్/ భీమదేవరపల్లి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని, భారతరత్న పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా పలువురు నేతలు ఆయనకు నివాళులర్పించారు. సీఎం రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో పీవీ చిత్రపటానికి పూలమాల వేసి స్మరించుకున్నారు. హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్డులో ఉన్న పీవీ ఘాట్ వద్ద ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, పీవీ అభిమానులు పుష్పాంజలి ఘటించారు. అలాగే గాంధీభవన్‌లో, శాసనసభ లాబీలో, పీవీ పుట్టిన ఊరు వరంగల్ జిల్లా నర్సంపేట మండలం లక్నేపల్లి, స్వగ్రామం భీమదేవరపల్లి మం డలం వంగరలో పీవీ జయంతిని ఘనంగా నిర్వహించారు. నరసింహారావు దేశానికి చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. దేశ ఆర్థిక వృద్ధిలో నరసింహారావు పాత్ర కీలకమైనదని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. ఆర్థిక, రాజకీయ పరివర్తన కీలకమైన దశలో ఉన్న దేశాన్ని అభివృద్ధి మార్గంలో నడిపించారని తెలిపారు. ఆయన సేవలను ఎక్స్ వేదికగా మోదీ గుర్తు చేసుకున్నారు. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన పీవీకి దేశం కృతజ్ఞతలు చెబుతోందని తెలిపారు. నరసింహారావు ప్రభుత్వం అనుసరించిన విస్తృత శ్రేణి ఆర్థిక సరళీకరణ విధానాలతో దేశం అన్ని రంగాల్లోనూ గణనీయమైన వృద్ధిని సాధించిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కొనియాడారు. దేశాభివృద్ధిలో ఆయనది చెరగని ముద్రన్నారు. పీవీ సంస్కరణలతో మధ్యతరగతికి ఎంతో మేలు జరిగిందన్నారు. పీవీ బహుభాషా కోవిదుడిగా, రచయితగా, ఆర్థిక సంస్కరణల పితామహుడిగా దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. పీవీ దూరదృష్టితో చేపట్టిన సంస్కరణలు దేశ ఆర్థిక వ్యవస్థకు బలమైన పునాదులు వేశాయని గుర్తు చేశారు. పీవీ తెలంగాణలో పుట్టడం మన అదృష్టమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. దేశంలో అనేక సంస్కరణలకు ఆద్యుడు పీవీ అని కొనియాడారు. పీవీ మార్గాన్ని ప్రజా ప్రభుత్వం అనుసరిస్తోందని చెప్పారు. బీజేపీ ఎంపీ లక్ష్మణ్ మాట్లాడుతూ.. పీవీ సేవలను గుర్తిం చి ప్రధాని మోదీ ప్రభుత్వం వారికి భారతరత్న అవార్డు ఇచ్చి గౌరవించిందని గుర్తు చేశారు. గత ప్రభుత్వాలు పీవీ సేవలను విస్మరించి రాజకీయంగా ఇబ్బందులకు గురిచేశాయన్నారు. ప్రధానిగా ఆర్థిక సంస్కరణలను తెచ్చి దేశాన్ని భారీ సంక్షోభం నుంచి గట్టెక్కించిన మేధావి పీవీ నరసింహారావు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొనియాడారు. గురుకుల విద్యాలయాలకు అంకురార్పణ చేసి విద్యారంగానికి ఎనలేని సేవలు చేశారన్నారు.

ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సులో పొగలు



బస్సు నుంచి పొగలు రాకుండా ఆర్పివేస్తున్న ఫైర్ సిబ్బంది

భగత్‌నగర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కరీంనగర్-2 డిపోలోని ఎలక్ట్రిక్ బస్సులో శనివారం పొగలు వ్యాపించాయి. జేబీఎం ఎలక్ట్రిక్ సూపర్ లగ్జరీ బస్సు నంబరు టీఎస్ 02 టీ 1099 డిపోలో పార్క్ చేసింది. బస్సును తీసుకెళ్లేందుకు వచ్చిన డ్రైవర్ స్టార్ట్ చేయడంతో ఒక్కసారిగా పొగలు వ్యాపించాయి. గమనించిన డ్రైవర్ వెంటనే ఆర్టీసీ అధికారులకు సమాచారం అందించారు. అధికారులు అప్రమత్తమై అగ్నిమాపక సిబ్బందికి విషయం చెప్పగానే ఫైర్‌సిబ్బంది వచ్చి ఆర్పి వేశారు. ఈ ఘటనలో ఎలాంటి నష్టమూ జరగకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

వర్షాకాలం.. వ్యాధులతో జాగ్రత్త



అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు

సుభాష్‌నగర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం మొదలైంది. కొత్తనీటితోపాటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. ఆరోగ్య సమస్యలూ పెరుగుతాయి. తాగునీటి కలుషితంతో జ్వరం, దగ్గు, జలుబు, ఒంటి నొప్పులు, తలనొప్పి వంటి సమస్యలు తలెత్తుతాయి. ప్రధానంగా వర్షం నీటి నిలువతో దోమలు వృద్ధి చెందుతాయి. ఇవి డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, డయేరియా, చికున్‌గున్యా, స్వైన్ ఫ్లూకు సంబంధించిన వైరస్‌లు, బ్యాక్టీరియాల వ్యాప్తికి తోడ్పడడంతో జ్వరాలు విజృంభించే అవకాశాలు ఉన్నాయి. సీజనల్ వ్యాధులు, జ్వరాలపై అవగాహన అవసరమని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు.

● చికున్‌గున్యా

చికున్ గున్యా వైరస్ కూడా దోమల ద్వారా వ్యాప్తి చెందుతుంది. ఇది ప్రాణాతంకంకాని వైరల్ వ్యాధి అని వైద్యులు చెబుతున్నారు. చికున్‌గున్యా వచ్చిన వారిలో తలనొప్పి, కండరాల నొప్పి, కీళ్ల నొప్పులు అధికంగా ఉంటాయి.

● మలేరియా

ఈ కాలంలో మలేరియా వ్యాప్తి కూడా ఎక్కువే. మలేరియా జ్వరానికి కారణమయ్యే ప్లాస్మోడియం పరాన్నజీవి ఆడ అనాఫిలస్ దోమ ద్వారా వ్యాపిస్తుంది. చల్లని వాతావరణంతో ఫ్లూ వ్యాధి కూడా ఇబ్బంది పెడుతుంది. పిల్లలు, వృద్ధులు, గర్భిణులు, దీర్ఘకాలిక రోగాలతో బాధపడేవారిపై ఇది వెంటనే దాడిచేస్తుంది. ముక్కు కారడం, జలుబు, దగ్గు, ఆయాసం ప్రధాన లక్షణాలు.

● టైఫాయిడ్

టైఫాయిడ్ అనేది కలుషిత ఆహారం, నీరు ద్వారా వ్యాపించే బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్. నిరంతర జ్వరం, బహీనత, కడుపునొప్పి, తలనొప్పి, ఆకలి లేకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

● డెంగ్యూ

డెంగ్యూ జ్వరం వైరస్ దోమల ద్వారా వ్యాపిస్తుంది. నిలకడగా ఉన్న నీటిలో ఇవి సంతానోత్పత్తి చేస్తాయి. పాత డ్రమ్ములు, పూల కుండీలు, పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, పగిలిన నీటి తొట్టెల్లో ఈ దోమలు ఎక్కువగా ఉంటాయి. ఈ దోమలు కుట్టిన 7 నుంచి 8 రోజుల్లో హఠాత్తుగా జ్వరం రావడం, కళ్లు కదలించలేని పరిస్థితి ఉంటుంది. ఎముకలు, కండరాల్లో భరించలేని నొప్పి, శరీరంపై దద్దుర్లు, వాంతులు విరేచనాలు వంటి లక్షణాలు కనిపిస్తాయి. కొందరిలో ప్లేట్‌లెట్స్ తగ్గి షాక్ సింగ్రోమ్‌కు దారి తీస్తుంది.

● ఇన్‌ఫ్లూయింజా(ఫ్లూ)

ఇన్‌ఫ్లూయింజా అనేది శ్వాసకోశ వ్యవస్థను ప్రభావితం చేసే వైరల్ ఇన్‌ఫెక్షన్. వర్షాకాలంలో ఇది ఎక్కువగా వచ్చే అవకాశాలు ఉన్నాయని డాక్టర్లు చెబుతున్నారు. తేమతో కూడిన పరిస్థితుల కారణంగా ఇది సులభంగా వ్యాపిస్తుంది.

జాగ్రత్తలు తీసుకోవాలి

- డాక్టర్ రఘురామన్, సీనియర్ ఫిజీషియన్



వర్షాకాలం వ్యాధులను కూడా మోసుకొస్తుంది. ఇందులో దోమల ద్వారా మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా వంటివి వ్యాపిస్తాయి. వీటి బారిన పడకుండా ఉండాలంటే ముందుగా ఇంటితోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ముఖ్యంగా మురుగు నీరు, వర్షపు నీరు నిలువ ఉండకుండా జాగ్రత్త పడాలి. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు చెప్పే జాగ్రత్తలను పాటించాలి. వారంలో ఒకరోజు డ్రైడే పాటించాలి. దోమ తెరలు, లిక్విడ్‌లు వాడాలి. తినే ఆహారం, తాగే నీరు కలుషితం కాకుండా జాగ్రత్తపడాలి. పరిశుభ్రమైన నీరు, వేడిగా ఉన్న ఆహారం తీసుకోవాలి. వ్యక్తిగత శుభ్రతను పాటించాలి. ముఖ్యంగా చిన్నపిల్లలు ఆరోగ్యసూత్రాలు పాటించేలా వారికి వివరించాలి.

అర్చక పోస్టుల భర్తీకి ఖాళీల వివరాల కోసం ఆదేశాలు

కరీంనగర్ కల్చరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): దేవాదాయశాఖ పరిధిలోని ఆలయాల్లో అర్చకపోస్టుల భర్తీకి ఖాళీల వివరాలు పంపాలని రాష్ట్ర కమిషనరేట్ కార్యాలయం నుంచి జిల్లాల్లోని అధికారులకు శనివారం ఆదేశాలు అందాయి. ఈ మేరకు ఉప ప్రధానార్చక, ముఖ్య అర్చక, అర్చక, పరిచారక పోస్టులను ఖాళీల ఆధారంగా త్వరలో భర్తీచేసేందుకు సన్నాహాలు ప్రారంభించనున్నట్లు తెలిసింది. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 300పోస్టులు ఖాళీగా ఉన్నట్లు గుర్తించారు. ఉమ్మడి కరీంనగర్‌జిల్లాలోని వేములవాడ,కొండగట్టు,ధర్మపురి ఆలయాల వివరాలు కమిషనరేట్ కార్యాలయంలో తెలియాల్సిఉండగా జిల్లాలో 6ఏ,బీ,సీ ఆలయాల్లో ఉపప్రధానార్చకుడు ఒక పోస్టుతో పాటు ముఖ్య అర్చకపోస్టులు ఏడుకు ఏడు భర్తీ అయిఉన్నాయి. అర్చక విభాగంలో 64పోస్టులుండగా 58మంది, పరిచారక విభాగంలో 28పోస్టులకు 23మంది విధులు నిర్వహిస్తున్నారు. అర్చక విభాగంలో 6, పరిచారక విభాగంలో 5చొప్పున ఈ రెండు విభాగాలు కలిపి 11పోస్టులు భర్తీ చేయాల్సిన అవసరంఉందని సహాయ కమిషనర్ కార్యాలయం వెల్లడించారు. అనలేపోస్టులు మంజూరుకానివి, ప్రస్తుతం ఖాళీలు ప్రకటించినవి కలిపి సుమారు 51ఆలయాలున్నాయి. రాష్ట్ర కమిషనర్ తదుపరి ఆదేశాలమేరకు ఆలయాల పేర్లతో వివరాలు పూర్తిగా తెలుపవచ్చని, ప్రస్తుతం ఖాళీల వివరాలు పంపిస్తున్నామని ఉమ్మడి జిల్లా సహాయకమిషనర్ నాయిని సుప్రియ తెలిపారు.

వేతన వెతలు..

- మూడు నెలలుగా గ్రామపంచాయతీ కార్మికులకు అందని జీతాలు
- కుటుంబ పోషణకు ఇబ్బందులు



జాగీర్‌పల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం

సైదాపూర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): నిత్యం గ్రామాల్లో పారిశుధ్యం మొదలు.. నల్లానీరు, వీధిదీపాలు, పన్నులవసూళ్లు ఇలా అన్నిరకాల పనులుచేస్తూ.. గ్రామాలు పరిశుభ్రంగా ఉంచే గ్రామపంచాయతీ కార్మికులకు వేతన వెత తప్పడం లేదు. మూడునెలలుగా జీతాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ పంచాయతీ కార్మికులను ఒకే గొడుగు కిందకు తెచ్చి గతప్రభుత్వం మల్టీపర్పస్ వర్కర్లుగా జీవో తీసుకువచ్చింది. గ్రామ పంచాయతీలో పని చేసే వారు ఏ పనైనా చేయాలి. అందరికీ ఒకే వేతనం నిర్ణం యించింది. దీంతో గ్రామ పంచాయతీ వర్కర్లు మల్టీపర్పస్ వర్కర్లుగా కొనసాగుతున్నారు. మూడు నెలలుగా జీతాలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతు న్నామని, ప్రభుత్వం స్పందించి జీతాలు విడుదల చేయాలని గ్రామ పంచాయతీ కార్మికులు కోరుతున్నారు.

సింగరేణి మెడికల్ కళాశాలలో 150 సీట్లకు అనుమతి

● ఎన్ఎంసీ గ్రీన్ సిగ్నల్



సింగరేణి మెడికల్ కళాశాల

కళ్యాణ్‌నగర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా 26 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో నిర్వహణలో లోపం ఉండడంతో జాతీయ వైద్య విద్య కమిషన్ ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం అనుమతికి అభ్యంతరాలు తెలిపింది. ఈ ఏడాది సింగరేణి మెడికల్ కళాశాల 4వ సంవత్సరంలో అడుగు పెట్టనున్నది. కళాశాలల లోపాలపై రాష్ట్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి, డీఎంఈతో పాటు వివిధ కళాశాలలకు చెందిన ప్రిన్సిపాల్స్‌ను, డీన్‌లను ఈ నెల 18న ఢిల్లీకి రావాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఆరోగ్య కార్యదర్శి, ప్రిన్సిపాల్ డీన్‌లతో చర్చించిన ఎన్ఎంసీ సింగరేణి మెడికల్ కళాశాలతో పాటు మిగతా 25కళాశాలలకు 150ఎంబీబీఎస్ సీట్లకు అనుమతిని ఇస్తున్నట్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని సింగరేణి మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హిమబిందు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 26కళాశాలల్లో అసౌకర్యాలు ఉండడం, కొన్ని కళాశాలలు గోడౌన్‌లలో నిర్వహించడం, విద్యార్థులకు సరైన సౌకర్యాలు లేకపోవడం, వసతి గృహాలు లేకపోవడం, బోధన సిబ్బంది లేకపోవడంతో ఎన్ఎంసీ తీవ్ర అభ్యంతరం చెప్పింది. దీనిపై రాష్ట్ర ఆరోగ్య కార్యదర్శి, వైద్యవిద్య సంచాలకులు, ప్రిన్సిపాల్స్ డీన్‌లు అసౌక ర్యాలపై నివేదిక ఇవ్వడంతో శనివారం 150సీట్ల నిర్వహణపై అనుమతులు ఇచ్చింది.

2న ఉమ్మడి జిల్లా మహిళా క్రికెట్ జట్టు ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా మహిళా క్రికెట్ జట్టు ఎంపికకు ప్రిలిమినరీగా గోదావరిఖని, కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్లలో జూలై 2న మహిళా ఎంపిక పోటీలను నిర్వహించనున్నామని జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆగంరావు, మురళీధర్ రావు ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్రస్థాయి మహిళా క్రికెట్ పోటీల్లో ఉమ్మడిజిల్లా జట్టు పాల్గొంటుందని పేర్కొ న్నారు. ఉమ్మడిజిల్లా జట్టు ఎంపికకు ముందుగా 60మంది మహిళా క్రికెటర్లను ఎంపిక చేసి వారిని నాలుగు జట్లుగా విభజించి రౌండ్ రాబిన్ పద్ధతిలో మ్యాచ్‌లను కరీంనగర్‌లో నిర్వహించనున్నామని తెలిపారు. ఈ మ్యాచ్‌లలో ప్రతిభ చాటే క్రీడాకారులను ఉమ్మడిజిల్లా మహిళా క్రికెట్ జట్టుకు ఎంపిక చేయనున్నామని పేర్కొన్నారు. ఆయాప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ చేసుకొని జూలై 2నఉదయం 8గంటలకు మైదానాల్లో కోచ్‌లకు రిపోర్టు చేయాలని సూచించారు. వివరాలకు కరీంనగర్‌లో శ్రవణ్(కేడీసీఏ ఆఫీస్ నెట్స్) 8688768775, గోదావరిఖనిలో కిరణ్‌కుమార్(జీఎంఆఫీస్ గ్రౌండ్) 9866351620, జగిత్యాలలో జలపతి (వివేకానంద స్టేడియం) 9948064712, సిరిసిల్లలో మనోహర్ (రైజింగ్ స్పోర్ట్స్ అకాడమీ)ను 8497979747 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

గుంతలు తీయడం త్వరగా పూర్తి చేయాలి..

కోనరావుపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : పది రోజుల్లో మొక్కలు నాటేందుకు గుంతలు తీయడం పూర్తిచేయాలని డీఆర్‌డీవో శేషాద్రి అన్నారు. కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామంలో మొక్కలు నాటేందుకు తీస్తున్న గుంతలను పరిశీలించారు. అనంతరం కనగర్తి గ్రామంలో నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటేం దుకు అన్ని సిద్ధం చేస్తున్నామని అన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శంకర్ రెడ్డి, ఏపీవో శ్రీనివాస్, టెక్నికల్ అసిస్టెంట్ రాజు, గణేష్, జీపి కార్యదర్శి సతీష్, ఫీల్డ్‌అసిస్టెంట్స్ తిరు పతి, స్వప్న, తదితరులు ఉన్నారు.

సంచార జాతి కుటుంబాలకు చేయుత

సిరిసిల్ల టౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్లకు పట్టణం శివారు ప్రాంతాలలో గుడిసెలు వేసుకొని ఉంటున్న సంచార జాతి కుటుంబాలకు శనివారం ప్రేరణ స్వచ్ఛంద సేవా సంస్థ చేయుతను అందించింది. సంచార జాతులకు చెందిన ఒక్కో కుటుంబాని 50 కేజీల బియ్యంను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రేరణ స్వచ్ఛంద సేవా సంసత ప్రతినిధులు బజ్జూరి పురుషోత్తం, అన్విత్, నీలి సంతోష్, అన్నారపు వేణు, సతీష్, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్ల సమితి మాజీ అధ్యక్షుడి వర్ధంతి

ఎల్లారెడ్డిపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో సిరిసిల్ల సమితి మాజీ అధ్యక్షుడు నేవూరి వెంకట్‌రెడ్డి వర్ధంతిని అల్లం లక్ష్మన్, ద్యాగం రాములు, రావుల మల్లారెడ్డి, కటుకం రామచంద్రంల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. స్థానిక పశువుల సంత ఆవరణలో వెంకట్‌రెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అల్లం లక్ష్మణ్, ద్యాగం రాములు, రావుల మల్లారెడ్డి, కటుకం రామచంద్రం, ప్యాక్స్ చైర్మన్ కృష్ణా రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, నాయకులు గిరిధర్‌రెడ్డి, వెంకటనర్సింహారెడ్డి, రాజం, వెంకట్‌రెడ్డి, బాలరాజుయాదవ్, రమేశ్, బాబు, దేవదాస్, లింగం, నర్సయ్య, రాజిరెడ్డి, బాల్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

ఎల్లారెడ్డిపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు రాచర్లగొల్లపల్లి, రాచర్లతిమ్మాపూర్ గ్రామాల్లోని లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను స్థానిక కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు శనివారం అందజేశారు. పేదల వైద్యానికి సీఎంఆర్ఎఫ్ వరంలాంటిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మారెడ్డి, రాంరెడ్డి, బాబు, గిరిధర్‌రెడ్డి, గోపాల్, బుచ్చాగౌడ్, బాల్‌రెడ్డి, రఫీక్, తిరుపతి, చందు, నారాయణ, రవీందర్, శ్రీనివాస్, సత్తయ్య, దేవేందర్, ప్రవీణ్, నర్సింలు, చంద్రారెడ్డి, సురేశ్, జబ్బార్, నర్సయ్య, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

మంత్రి వివేక్ వెంకటస్వామిని కలిసిన కాంగ్రెస్ నేత

గంభీరావుపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామిని గంభీరావుపేట మండలం గజసింగవరం గ్రామానికి చెందిన కరీంనగర్ పార్లమెంటు ఎన్నికల కో-ఆర్డినేటర్ కొండూరి గాంధీ శనివారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టడంతో పాటు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇసుక కొరత లేకుండా చూడాలని కోరారు. కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలని విన్నవించారు.

జీపీ కార్మికులకు దుస్తులు అందజేత

కోనరావుపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం నాగారం గ్రామంలో గ్రామ పంచాయతీ కార్మికులకు కోనరావుపేట మార్కెట్ కమిటీ డైరెక్టర్ అప్పాల నాగభూషణం నూతన దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి అప్సాన, సైన్ల నాగరాజు, బాస దేవరాజు, జనార్ధన్, మేకల ప్రదీప్, పవన్ తదితరులు ఉన్నారు.

అనారోగ్యానికి గురైన వ్యక్తికి ఆర్థిక సహాయం

కోనరావుపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యానికి గురైన వ్యక్తికి చికిత్స నిమిత్తం కాంగ్రెస్ నాయకుడు మానుక సత్యం శనివారం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కోనరావుపేట మండలం నిమ్మపల్లి గ్రామానికి చెందిన గౌర రమేష్ పక్షవాతానికి గురయ్యాడు. మెరుగైన వైద్యం చేయించుకోవడానికి ఆర్థికంగా లేకపోవడంతో ప్రస్తుత సహాయం కింద మానుక సత్యం ఐదువేల రూపాయలను అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు నాగండ్ల భూమేష్ అన్నారు.

పూచీకత్తు చెల్లిస్తేనే ఇసుకకు అనుమతి

ఎల్లారెడ్డిపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : ఇసుక రవాణాకు ట్రాక్టర్ యజమానులు రూ.10వేల పూచీ సొమ్మును కలెక్టర్ పేరిట డీడీ రూపంలో చెల్లించి వాహన పత్రాలతో నమోదు చేసుకుంటేనే అనుమతి ఇస్తామని తహసీల్దార్ సుజాత శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇసుక పన్ను చెల్లించని వాహనాలను రీచ్‌ల నుంచి తరలించేందుకు అనుమతించబోమని పేర్కొన్నారు. ఇసుక రవాణాదారులు తమ వాహన ధ్రువీకరణ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్, యజమాని, డ్రైవర్ల పేర్లు, ఆధార్ కార్డులు, వాహన ఇన్సూరెన్స్ ఫిట్నెస్, పొల్యూషన్, సెల్ నంబర్లతో కూడిన వివరాలను జత చేసి పన్ను చెల్లించి జూలై 15లోగా తహసీల్దార్ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. పన్ను చెల్లించకుండా ఇసుకను తరలిస్తే కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ సుజాత హెచ్చరించారు.

దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సీపీఐ మద్దతు

- జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్

సిరిసిల్ల టౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా జూలై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సీపీఐ పూర్తి మద్దతు ఉంటుందని సీపీఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్ అన్నారు. శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కార్మిక భవనంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడో సారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను పూర్తిగా నిర్వీర్యం చేసి నాలుగు కోడులుగా విభజించడాన్ని సీపీఐ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. కార్పోరేట్ శక్తులకు అనుకూలంగా కార్మిక చట్టాలను బీజేపీ ప్రభుత్వం మార్చుతుందని ఆరోపించారు. రాజ్యాంగ స్ఫూర్తితో జూలై 9న తలపెట్టిన సమ్మెకు జిల్లాలోని ప్రజా సంఘాలు, కార్మిక సంఘాలు పూర్తి మద్దతునివ్వాలని అన్నారు. ఈ సమావేశంలో సీపీఐ పట్టణ కార్యదర్శి పంతం రవి, నాయకులు కడారి రాములు, మీసం లక్ష్మన్, సోమ నాగరాజు, ఎలిగేటి రాజశేఖర్ పాల్గొన్నారు.

దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

కోనరావుపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను కార్మికులందరూ విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎగమంటి ఎల్లారెడ్డి కోరారు. కోనరావుపేట మండలం నిమ్మపల్లి గ్రామంలో శనివారం దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాసే ప్రయత్నం చేస్తుందని అన్నారు. కార్మికుల హక్కులను కాపాడుకోవడానికి సీఐటీయూ ఆధ్వర్యంలో జూలై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో లింగంపల్లి శంకర్, సామర్ల రమేష్, భూక్య రవి, వెంకటేష్, సుశీల, దేవవ్వ తదితరులు ఉన్నారు.

విద్యుత్‌షాక్‌తో 15 కోతులు మృతి

రుద్రంగి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని మానాల ఎక్స్‌రోడ్డు వద్ద ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో 15 కోతులు మృత్యువాత పడ్డాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మానాల ఎక్స్‌రోడ్డు వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ పైకి కోతుల గుంపు ఎక్కడంతో ఒక్కసారిగా విద్యుత్ షాక్ రావడంతో 15 కోతులు మృతిచెందాయని తెలిపారు. కోతులను స్థానికులు అటవీ ప్రాంతంలోకి తరలించి పూడ్చిపెట్టారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య

తంగళ్లపల్లి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపూర్‌కు చెందిన ముగ్ధం అశోక్(25) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఆర్థిక ఇబ్బందులు, తల్లిదండ్రులు లేక ఒంటరితనంతో మనస్తాపం చెందిన అశోక్ శుక్రవారం రాత్రి గ్రామశివారులో పురుగుల మందు తాగి బంధువులకు ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. అపస్మారక స్థితిలో ఉన్న అశోక్‌ను జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం శనివారం రాత్రి వరంగల్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతిచెందాడు. ఆర్థిక ఇబ్బందులు, పెళ్లి కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుడి చిన్నాన్న రవి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆదాయం ఘనం.. సౌకర్యాలు శూన్యం..

- సొంత భవనాల్లేని ఎక్సైజ్ స్టేషన్లు..

- అద్దె భవనాలే దిక్కు

సిరిసిల్ల క్రైం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్‌శాఖ ఆదాయం ఘనంగా వస్తున్నప్పటికీ సౌకర్యాలు శూన్యంగా కనిపిస్తాయి. ఎక్సైజ్ శాఖ స్టేషన్లకు సొంత భవనాల్లేని పరిస్థితి నెలకొంది. అద్దె భవనాలే దిక్కయ్యాయి. ఏటా ఎక్సైజ్ ఆదాయం రూ.600 కోట్లకు పైగా ఉన్నప్పటికీ సొంత భవనాల్లేని పరిస్థితి నెలకొంది. జిల్లాలో ఎక్సైజ్ స్టేషన్‌లు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. జిల్లా ఏర్పడ్డాక అద్దె భవనాలకు కాలం చెల్లనుందని భావించినప్పటికీ అతిగతిలేదు. అద్దెభవనాల్లో తరచూ సమస్యలు నెలకొన్నప్పటికీ అద్దెభారం వెంటాడుతుంది. కొన్నేండ్లుగా అద్దె చెల్లింపు డబ్బులతోనే సొంత భవనాలు నిర్మించే అవకాశం ఉండేది. పట్టణాల్లోనే ఎక్సైజ్ స్టేషన్‌లు ఉండడతో చుట్టుపక్కల ప్రజలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఎక్సైజ్ స్టేషన్‌లకు పక్కా భవనాల నిర్మాణానికి వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కృషి చేయాల్సిన అవసరం ఉంది.



అద్దె భవనంలో సిరిసిల్ల ఎక్సైజ్ స్టేషన్

సొంతభవనాల నిర్మాణాలకు ఊసేది..?

జిల్లాలోని ప్రతి ఎక్సైజ్‌స్టేషన్‌కు సొంత భవనాలు నిర్మించాలని ప్రభుత్వ నిర్ణయించినప్పటికీ ఆ ఊసేలేదు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో సిరిసిల్ల, వేములవాడ, ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ స్టేషన్‌లతో పాటు సూపరింటెండెంట్ కార్యాలయం ఉంది. ఇందులో మూడు ఎక్సైజ్ స్టేషన్‌లకు సొంత భవనాలు లేదు. జిల్లా ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ కార్యాలయం సమీకృత కలెక్టరేట్ సముదాయంలో ఉంది. ఎక్సైజ్ స్టేషన్‌లకు సొంత భవనాల నిర్మాణానికి స్థలం కేటాయించారు. నిధుల మంజూరుకు గతంలోనే ప్రతిపాదనలు చేశారు. అయినప్పటికీ అతిగతీ లేదు.

మూడు ఎక్సైజ్ స్టేషన్లకు స్థలం..

జిల్లాలోని మూడు ఎక్సైజ్ స్టేషన్‌లకు స్థలం కేటాయింపు పూర్తయింది. జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ, ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ సర్కిల్, స్టేషన్ కార్యాలయాల నిర్మాణానికి స్థలం కేటాయించారు. సిరిసిల్లలో 10గుంటలు, వేములవాడలో 12గుంటలు, ఎల్లారెడ్డిపేటలో 20 గుంటలు కేటాయిస్తూ రెవెన్యూ శాఖ ఆదేశాలిచ్చింది. ఎక్సైజ్ స్టేషన్‌లకు స్థలం కేటాయించినప్పటికీ ముందడుగు వేయడంలేదు. ఇప్పటికీ నిర్మాణానికి నోచుకోవడం లేదు.

నిధులు ల్యాప్స్..

జిల్లాలోని మూడు ఎక్సైజ్ స్టేషన్‌లకు పక్కా భవనాలు నిర్మించడానికి గత ప్రభుత్వం రూ. కోటి26 లక్షలు మంజూరు చేసినప్పటికీ ల్యాప్స్ అయ్యాయి. ఇందులో ఒక్కో స్టేషన్‌కు రూ. 42లక్షల చొప్పున కేటాయించింది. ఈ నిధులను పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్‌కు మళ్లించారు. సిరిసిల్ల, వేములవాడ, ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ స్టేషన్‌ల నిర్మాణానికి పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ నిర్మాణాలు చేపట్టాలి. సొంతభవనాల నిర్మాణ పనులు ప్రారంభం చేసేందుకు పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ సిద్ధం చేసింది. అయినప్పటికీ టెండర్లు కాక నిధులు ల్యాప్స్ అయ్యాయి. ప్రస్తుత ప్రభుత్వంలోనైనా ఎక్సైజ్ స్టేషన్‌లకు నిధులు మంజూరు చేసి పక్కా భవనాలను నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రతిపాదనలు చేశాం

- పి. శ్రీనివాసరావు, ఇన్‌చార్జి ఎక్సైజ్ సూపరింటెండెంట్



జిల్లాలోని మూడు ఎక్సైజ్ స్టేషన్‌లకు పక్కాభవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. ఎక్సైజ్ స్టేషన్‌లు చాలాకాలంగా అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. అద్దె భవనాలతో కొంత ఇబ్బందిగానే ఉంది.

బీడీ కార్మికులకు రావాల్సిన వేతనాలు అందించాలి

- సీఐటీయూ బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు రమేష్

సిరిసిల్ల రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : ఠాకూర్ సౌదేఖర్ బీడీ కంపెనీలో పనిచేస్తున్న బీడి కార్మికులకు రావాల్సిన వేతనాలను ఇప్పించాలని సీఐటీయూ బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు మూషం రమేష్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని అమృత్‌లాల్ శుక్లా కార్మిక భవనంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో రమేష్ మాట్లాడుతూ ఈ బీడీ కంపెనీలో పనిచేస్తున్న కార్మికులకు గత అరు నెలలుగా వేతనాలు ఇవ్వకుండా యాజమాన్యం తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. ఆరునెలలుగా కూలీ డబ్బులు ఇవ్వకపోవడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. కార్మికులు అప్పులు చేసి కుటుంబాలను పోషించుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. చేసిన అప్పులకు మిత్త కట్టలేక బీడీ కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. వేతనాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేయడంతో పాటు శ్రమదోపిడీకి గురిచేస్తున్నారన్నారు. కంపెనీల కిరాయి కూడా కార్మికుల వేతనాలను నుంచి వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి బీడీ కంపెనీ యాజమాన్యంపై కార్మిక శాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని లేకుంటే హైదరాబాద్‌లోని లేబర్ కమిషనర్‌కు ఫిర్యాదులు చేస్తామన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే తగిన చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో బీడీ కార్మిక సంఘం నాయకులు సూరం పద్మ, శ్రీరాముల రమేష్‌చంద్ర, జిందం కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

ఘనంగా మాజీ ప్రధాని పీవీ జయంతి



సిరిసిల్లలో నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సిరిసిల్ల టౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధాన మంత్రి పీవీ నర్సింహారావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పీవీ నర్సింహారావు చిత్రపటానికి నాయకులు పూలతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, రాష్ట్రకార్యదర్శి గూడూరి ప్రవీణ్, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, మాజీ ప్రజాప్రతినిధులు కోడి అంతయ్య, చంద్రయ్యగౌడ్, దార్ల సందీప్, రిక్కమల్ల సంపత్‌కుమార్, గజభీంకార్ రాజన్న, నాయకులు కుంభాల మల్లారెడ్డి, కంచర్ల రవిగౌడ్, దినేష్, దిడ్డి రాజు తదితరులు పాల్గొన్నారు.

●ఎల్లారెడ్డిపేట : భారత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు జయంతి వేడుకలను ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు శనివారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పీవీ నర్సింహారావు దేశానికి చేసిన సేవలను కొనియాడారు. మాజీ జడ్పీటీసీ కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులు చిత్రపటానికి పూలమాలలు వేసి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ కృష్ణహరి, తాజా, మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, రాంరెడ్డి, గౌస్, గిరిధర్‌రెడ్డి, బాలయ్య, రాజేందర్, వెంకట్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, నారాయణ, బాల్‌రెడ్డి, ఇమాం, రఫీక్, వెంకటనర్సింహారెడ్డి, శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, జబ్బార్, నర్సింలు, సీత్యానాయక్, రాజునాయక్, రాజం, బాల్‌రెడ్డి, నర్సింహారెడ్డి, వెంకట్‌రెడ్డి, సుధాకర్‌రావు, సందీప్, మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో సత్తాను చాటాలి

సిరిసిల్ల రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో భారతీజనతా పార్టీ నుంచి పోటీ చేసే అభ్యర్థుల గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు ఐక్యం కృషి చేసి సిరిసిల్ల మున్సిపాలిటీపై కాషాయం జెండాను ఎగురువేయాలని కరీంనగర్ పార్లమెంటరీ కో-కన్వీనర్ అడెపు రవీందర్ కోరారు. సిరిసిల్ల పట్టణంలోని శివనగర్ శివాలయంలో శనివారం నూతనంగా నియమాకమైన సిరిసిల్ల పట్టణ బీజేపీ కమిటి సభ్యులను మాజీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ అధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పార్లమెంటరీ కో-కన్వీనర్ అడెపు రవీందర్ మాట్లాడుతూ పట్టణంలో భారతీయ జనతా పార్టీలో పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తలు పార్టీ బలోపేతంతో పాటు కౌన్సిల్ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలన్నారు. తాను సిరిసిల్ల మున్సిపల్ చైర్మన్‌గా పనిచేసిన సమయంలో పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశానన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్ పట్టణ మహిళా మోర్చా పట్టణ అధ్యక్షురాలు వేముల వైశాలి, జిల్లా ఉపాధ్యక్షురాలు పండుగ మాధవి, పట్టణ ప్రధాన కార్యదర్శి కొండ నరేష్, మేర్గు శ్రీనివాస్, ఉపాధ్యక్షులు అంకారపు రాజు, కాంబోజు శ్రీధర్, నర్సయ్య, కోడం రవి, సూరం వినయ్, సదానందం, ఎనగంటి నరేష్, ఊరగొండ రాజు, గుడ్ల విష్ణు, సుంకోజు రమేష్‌చారీ, మొగిలి రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మంచి మార్గాలను ఎంచుకోవాలి : సీఐ

సిరిసిల్ల టౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా రాణిస్తూ సమాజంలో ఆదర్శంగా నిలవడానికి విద్యార్థులు మంచి మార్గాలను ఎంచకోవాలని సిరిసిల్ల పట్టణ సీఐ కృష్ణ అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణం పద్మనాయక కళ్యాణ మండపంలో నేతాజీ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఉద్యోగ కల్పనలో భాగంగా ఇంటర్‌షిప్ కార్యక్రమంలో భాగంగా గాట్నెక్స్ కంపనీలో 50మంది కళాశాల విద్యార్థులు ఎంపికకాగా వారికి ఆఫర్ లెటర్లను ముఖ్య అతిథులు పట్టణ సీఐ కృష్ణ, కళాశాల చైర్మన్ జూపల్లి పృథ్వీధర్‌రావు, కరస్పాండెంట్ నాయిని జగన్మోహన్‌రావు, ప్రిన్సిపల్ రేశం శ్రీకాంత్ చేతుల మీదుగా అందించారు. అదేవిధంగా గత సంవత్సరం కళాశాలలో కంప్యూటర్ కోర్స్ పూర్తి చేసిన 180 మంది విద్యార్థులకు సర్టిఫికట్లెను అందించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఉన్నత విద్యను పూర్తి చేసి మంచి హోదాలో ఉండేలా కృషి చేయాలన్నారు. అనంతరం జరిగిన సంస్కృతిక కార్యక్రమంలో విద్యార్థులు తమ ఆటపాటలతో అలరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు ఆఫర్ లెటర్స్‌ను అందిస్తున్న సీఐ

రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేసిన యువకులు

ఇల్లంతకుంట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు మరమ్మతుకు యువకులు ముందుకు వచ్చి పనులు చేపట్టడంతో గ్రామస్థులు అభినందించారు. మండలకేంద్రం నుండి కూనబోయినపల్లెకు వెళ్ళే దారిలోని కల్వర్టు కూలిపోవడంతో శుక్రవారం రాత్రి ముస్కానిపేట గ్రామానికి చెందిన సింగిరెడ్డి సంజీవరెడ్డి అనే సైక్లిస్ట్ మృతిచెందాడు. విషయం తెలుసుకున్న స్పోర్ట్స్‌క్లబ్ సభ్యులు కల్వర్టు వద్ద తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని నిర్ణయించారు. ఇతరుల సహకారం తీసుకొని కల్వర్టుపై ప్రమాదాలు జరుగకుండా చర్యలు చేపట్టారు. అంతేకాక ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. కల్వర్టు కూలినప్పుడే అధికారులు స్పందించి ఉంటే నిండుప్రాణం గాలిలో కలిసేది కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. కార్యక్రమంలో స్పోర్ట్స్‌క్లబ్ అధ్యక్షుడు మామిడి రాజు, మాజీ వార్డుసభ్యుడు చిట్టి ప్రదీప్‌రెడ్డి, యువజన నాయకులు మామిడి పర్శరాం, కూనబోయిన సుధాకర్, రేగుల కార్తీక్, తిప్పారపు శ్రీనివాస్, మొగిల్ల బాబు, తిప్పారపు సతీష్, మామిడి నాగరాజు, సతీష్, కనుకయ్యలతో పాటు పోలీస్, గ్రామపంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

తల్లులకు నిరీక్షణ..

(5వ పేజీ తరువాయి)

మూడో విడతలో ఇమ్యు నైజేషన్ సమయంలో రూ 2 వేలు, చివరి ఇమ్యునైజేషన్ నాలుగో విడతలో రూ 3 వేలు తల్లి ఖాతాల్లో జమ చేస్తారు. జిల్లాలో పథకం ప్రారంభమైన తరువా త వివిధ సేవలకు సంబంధించిన ప్రోత్సాహకాల్లో గర్భిణుల్లో 20,381 మంది, ప్రసూతి అయిన వారు 10,017మంది, మొదటి టీకాలు తీసుకున్నావారు 19,866 మంది, చివరి టీకాలు తీసుకున్నావారు 17,272 మంది లబ్ధి పొందారు. ప్రోత్సాహకం కోసం ఎదురుచూస్తున్న వారి బకాయిలు రూ.18 కోట్ల 3లక్షల 84వేలు ఉన్నాయి. ఇందులో గర్భిణులకు సంబంధించి 14,623 మందికి రూ 4,38,69,000, ప్రసూతి అయిన వారిలో 11,000 మంది రూ 4,95,00,000, మొదటి ఇమ్యునైజేషన్‌కు సంబంధించి 17,790 మందికి రూ 3,55,80,000, చివరి ఇమ్యునైజేషన్‌కు సంబంధించి 17,145 మందికి రూ 5,14,35,000 బకాయిలు రావాల్సి ఉంది. వీటి కోసం లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు.

అక్రమ మట్టి తవ్వకాలకు పాల్పడితే కఠిన చర్యలు

ఎస్పీ మహేష్ బీ. గీతే

వేములవాడ రూరల్ జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలకు విరుద్ధంగా అక్రమ మట్టి తవ్వకాలు, రవాణాచేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ మహేష్ బీ. గీతే అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ వేములవాడ పట్టణ పరిధిలోని కొడుముంజ గ్రామ శివారులో గల రామప్ప ఆలయం నుండి నిబంధనలకు విరుద్ధంగా మట్టి త్రవ్వి తరలిస్తున్నారన్న సమాచారం మేరకు వేములవాడ పట్టణ ఇన్‌స్పెక్టర్ వీరప్రసాద్, జిల్లా టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ నటేష్ ఆధ్వర్యంలో పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారన్నారు. దాడుల్లో ముగ్గురు వ్యక్తులు పట్టుబడగా అక్రమంగా మట్టి తవ్వకాలకు వినియోగిస్తున్న 10 టిప్పర్లు, 2 ఎక్స్‌కవేటర్లు, ఒక కారు స్వాధీనం చేసుకున్నారన్నారు. విచారణ అనంతరం అనంతరం ముగ్గురు వ్యక్తులు ఉత్తమ్ కరుణాకర్, భువనగిరి మహేష్, లంబ ప్రశాంత్‌లపై కేసు నమోదు చేసారన్నారు. మట్టి త్రవ్వకలు, రవాణా, నిల్వలపై చట్ట ప్రకారం సంబంధిత శాఖ అధికారుల ముందస్తు అనుమతి తప్పనిసరిగా ఉండాలన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

- ప్రజా సంఘాల నాయకుడు అరుణ్ కుమార్



ఎంఈవో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

వీర్నపల్లి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు, చార్జీలను విడుదల చేయాలని ప్రజాసంఘాల నాయకుడు మల్లారపు అరుణ్ కుమార్ డిమాండ్ చేశారు. మండలకేంద్రంలోని ఎంఈవో కార్యాలయదెదుట సీఐటీయూ మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి శనివారం ఆందోళన చేపట్టారు. కార్మికులకు బిల్లులు రాకపోవడంతో అప్పుల పాలవుతున్నారని మండిపడ్డారు. కార్మికుల కనీస వేతనం రూ.10వేలకు పెంచాలన్నారు. అనంతరం సీఐటీయూ అనుబంధ మధ్యాహ్న భోజన కార్మికులతో నూతన కమిటీని వేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు మనోజ్‌కుమార్, కార్మికులు లక్ష్మీ రాజవ్వ, భూదవ్వ, భారతి, దేవవ్వ, లక్ష్మి, గంగవ్వ, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని కోరితే ఎదురుదాడి..

ఇల్లంతకుంట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని కోరితే కాంగ్రెస్ నాయకులు ఎదురుదాడి చేస్తున్నారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి పేర్కొన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నిరుపేదలను వదిలిపెట్టి భూములు, భవనాలు ఉన్నవారికి ఇళ్లు కేటాయించారని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టామని అన్నారు. తమ తప్పులు ఎక్కడ భయటపడతాయోనని కాంగ్రెస్ నాయకుల్లో ఆందోళన నెలకొందన్నారు. ధర్నాను అడ్డుకునే ప్రయత్నం చేసి విఫలం చెందడటంతో కొంతమంది లబ్ధిదారులతో ఇల్లంతకుంటలో సమావేశం ఏర్పాటు చేయడం సరైన విధానం కాదన్నారు. తాము ప్రశ్నించిన వాటికి సమాధానం చెప్పకుండా అనవసరమైన విషయాలు మాట్లాడారని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో పొత్తూరు, కందికట్కూర్, ఒబులాపూర్, ఇల్లంతకుంట, పెద్దలింగాపూర్ గ్రామాలలో డబుల్‌బెడ్‌రూం ఇళ్లు నిర్మించినది కనిపించడం లేదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన 420దొంగ వాగ్దానాలు, 6గ్యారంటీలను నమ్మి ప్రజలు ఓట్లు వేస్తే వారిని నట్టేట ముంచుతున్నారన్నారు. సమావేశంలో ఉపసర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు సాదుల్, నాయకులు గొట్టెపర్తి పర్శరాం, సావనపెల్లి అనీల్‌కుమార్, కూనబోయిన రఘు, రాగటి రమేష్, గుర్రం తిరుపతిరెడ్డి, బుర్ర దేవయ్య, రాగటి సదానందం తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన ఎస్సైలు..

ఎల్లారెడ్డిపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన రాహుల్‌రెడ్డిని వివిధ పార్టీల నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. శాంతిభద్రతల పరిరక్షణకు తమకు సహకరించాలని ఎస్ఐ రాహుల్‌రెడ్డి కోరారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

● వీర్నపల్లి : వీర్నపల్లి నూతన ఎస్ఐగా వేముల లక్ష్మణ్‌ను నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు. అనంతరం ఎస్ఐ లక్ష్మణ్ మాట్లాడుతూ.. గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలన్నారు. ఫిర్యాదుదారులు నేరుగా సంప్రదించాలన్నారు. ఇక్కడ పనిచేసిన ఎస్ఐ ఎల్లయ్య గౌడ్ వేములవాడ టౌన్‌కు బదిలీ అయ్యారు.

కాగా, వీర్నపల్లి ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన లక్ష్మణ్‌ని వివిధ పార్టీల నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. శాంతిభద్రతల పరిరక్షణకు తమకు సహకరించాలని ఎస్ఐ కోరారు. అక్కడే బదిలీపై వెళ్తున్న ఎస్ఐ ఎల్లయ్య గౌడ్‌ని పోలీసు సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు.

క్షయ వ్యాధిపై అవగాహన

గంభీరావుపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండలం లింగన్నపేట పీహెచ్‌సీ పరిధిలోని ముచ్చర్లలో శనివారం క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ 163 మందికి పరీక్షలు నిర్వహించామని పేర్కొన్నారు. సీహెచ్‌వో రమేశ్, సూపర్‌వైజర్లు మహిపాల్, అమరావతి, వైద్య సిబ్బంది వనజ, హేమ, భారతి, కవిత తదితరులు పాల్గొన్నారు.